www.trinetnews.com

# ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 | సంచిక 79 | ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు | శుక్రవారం అక్టోబర్ 23, 2026 | పేజీలు:12 | వెల.10/-

## ఖిల్లా వరంగల్ అభివృద్ధికి పరిపాలన అనుమతులు



2లో

# విదేశాల్లో ఉన్నారుగా.. నా మాటలు వినిపించవులే!

- రాహుల్ విదేశీ పర్యటనపై అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు
- మరో 30 ఏళ్ల వరకు కాంగ్రెస్ అధికారంలోకి రాదంటూ వ్యాఖ్యలు
- 'ఓటు చోరీ' ఆరోపణలపై విపక్షాలకు కౌంటర్
- నిరసనలతో ప్రయోజనం లేదు.. ప్రజాసంక్షేమంపై దృష్టిపెట్టాలని హితవు
- ప్రజల్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకుంటేనే ఎన్నికల్లో గెలుస్తారని వ్యాఖ్యలు



2లో..

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో నిరసనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. మరో 30 ఏళ్లపాటు ఆయన పార్టీ అధికారానికి దూరంగా ఉంటుందని జోస్యం చెప్పారు.

# పాలమూరు నుంచి డిండికి నీటి తరలింపును ఆపండి

- డిండి నీటి తరలింపుపై మంత్రి ఉత్తమ్‌కు జిల్లా నేతల విజ్ఞప్తి
- ఏదుల నుంచి నీటిని తీసుకుంటే పాలమూరు ఆయకట్టుకు ఇబ్బందులని ఆందోళన
- డిండికి ప్రత్యామ్నాయ మార్గంలో నీటిని తరలించాలని డిమాండ్
- అధికారులతో చర్చించి ఆమోదయోగ్య నిర్ణయం తీసుకుంటామని ఉత్తమ్ హామీ



2లో

# పండుగ సాయన్న పోరాటం ఎందరికో ఆదర్శం

- భూస్వాములు, జమిందార్లపై పోరాడిన పండుగ సాయన్న: సీఎం
- పేదలకు భూములు పంచిన గొప్ప వ్యక్తిగా కొనియాడిన రేవంత్
- పండుగ సాయన్న జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటన
- ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలు ఏర్పాటు చేస్తామని వెల్లడి
- ముదిరాజ్ సామాజికవర్గానికి సంపూర్ణ న్యాయం చేస్తామని హామీ
- కులగణన, ఎస్సీ వర్గీకరణలో తమ ప్రభుత్వం ముందడుగు వేసిందని వ్యాఖ్యలు



**హైదరాబాద్:**
భూస్వాములు, జమిందార్లపై పోరాటం చేసిన వ్యక్తి పండుగ సాయన్న ముదిరాజ్ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (=వఋఖ్త్ర =వ‌స‌ఎఎ) అన్నారు. తన పోరాటం ద్వారా ఎందరికో ఆయన ఆదర్శంగా నిలిచారని చెప్పారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. దొరలు ఆక్రమించిన భూములను సాయన్న తన పోరాటంతో పేదలకు పంచిపెట్టారని కొనియాడారు. చరిత్ర పుటల్లో ఆయనకూ ఓ పేజీ ఉండాలన్నారు. ఆయన పోరాటాన్ని ఇప్పటికీ జానపదాలుగా పాడుకుంటారని సీఎం వివరించారు.

మిగతాది 2 లో

## ప్రకృతితో మమేకం కాకపోతే..

# విపత్తులు తప్పవు

- ప్రకృతితో కలిసి జీవించకపోతే విపత్తులు తప్పవు: వెంకయ్య నాయుడు
- భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత
- రాజకీయాలకు అతీతంగా అలయ్ బలయ్ వేడుకలు
- మనుషుల మధ్య ఐక్యతను పెంపొందించే వేదిక అలయ్ బలయ్
- ఏ మతాన్ని, పండగను తక్కువ చేసి చూడొద్దు: కిషన్‌రెడ్డి



2లో..

**హైదరాబాద్:**
భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ప్రకృతితో మమేకమై జీవనం సాగించకపోతే.. విపత్తులు తప్పవని హితవు పలికారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నేతృత్వంలో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరిగాయి.



2లో

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీళ్ల మళ్లింపుపై విచారణ జరపండి

- ఇరిగేషన్ శాఖ కార్యదర్శికి ఎంపీ చామల కిరణ్ లేఖ
- కొండపోచమ్మ సాగర్ నుంచి నీటి తరలింపుపై దర్యాప్తు చేయాలని డిమాండ్
- ప్రజల కోసం ఉద్దేశించిన నీటిని వ్యక్తిగత అవసరాలకు వాడారన్న ఆరోపణలు
- ప్రాజెక్టు రికార్డులు పరిశీలించి ప్రజాధనం వినియోగంపై లెక్కలు తేల్చాలని విజ్ఞప్తి
- బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరిన ఎంపీ చామల

## టెన్త్ విద్యార్థులకు అలర్ట్.. పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల



2లో

- మార్చి 2027 పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల
- ఆలస్య రుసుము లేకుండా నవంబర్ 16 వరకు చెల్లింపునకు అవకాశం
- రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 1 వరకు గడువు
- రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 14 వరకు చెల్లింపు
- రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 28 వరకు అవకాశం
- అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110 ఫీజు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫీజు మినహాయింపు



2లో

## మెదక్ జిల్లాలో ఏడుగురికి జీవిత ఖైదు

- పాత కక్షలతో యువకుడి హత్య.. ఏడుగురికి జీవిత ఖైదు
- ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధించిన జిల్లా కోర్టు
- 2020 మే 20న రాంపూర్ శివారులో నర్సింలు గౌడ్ హత్య
- పటిష్ఠ సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష ఖరారు
- సమర్థంగా దర్యాప్తు చేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఎస్పీ అభినందనలు



## ఇన్‌స్టాలోకి సోనియా గాంధీ.. తొలి పోస్టు ఇదే

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీఇన్‌స్టాగ్రామ్‌లోకి అడుగుపెట్టారు. గురువారం ఈ సోషల్‌మీడియా వేదికపైకి వచ్చిన ఆమె.. తొలి పోస్టు పెట్టారు. ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో దానికి సంబంధించిన కొన్ని దృశ్యాలను షేర్ చేశారు. "అందరికీ నమస్కారం.



2లో

## రేహాన్ వాద్రా ఫొటోల వివాదం.. బికనేర్ హౌస్ వివరణ

- రేహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌పై రాజకీయ దుమారం
- నిరసనలకు సంబంధించిన ఫొటోల తొలగింపుపై వివాదం
- సంస్థ విధానాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ నిర్వాహకుల అభ్యంతరం
- కళలు, సంస్కృతిని ప్రతిబింబించే ఫొటోలనే ప్రదర్శించాలని స్పష్టీకరణ
- భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేస్తున్నారంటూద రేహాన్ వాద్రా ఆరోపణ



02

## హైదరాబాద్ బాట పట్టిన జనాలు.. పంతంగి టోల్ ప్లాజా నుంచి దిల్ సుఖ్ నగర్ వరకు భారీ ట్రాఫిక్

దసరా సెలవులు ముగించుకుని జనాలు హైదరాబాద్ బాట పట్టారు. దీంతో సిటీ వచ్చే అన్ని రూట్లు వాహనాలతో రద్దీగా మారిపోయాయి. హైదరాబాద్ సమీపంలోకి వచ్చే సరికి ట్రాఫిక్ భారీగా పెరిగి వాహనాలు నెమ్మదిగా నడుస్తున్నాయి. 2026 అక్టోబర్ 22న (గురువారం ) హైదరాబాద్‌లోని ప్రధాన హైవేలు, ఆర్టీరియల్ రోడ్లపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విద్యాసంస్థలు తెరుచుకోవడానికి ముందు ప్రజలు నగరానికి చేరుకోవడంతో రోడ్లు మెల్లగా కదులుతున్నాయి. విజయవాడ-హైదరాబాద్ నేషనల్ హైవేపై ఉదయం నుంచే మంగళ్‌పల్లి నుంచి అవుటర్ రింగ్ రోడ్ వైపు వాహనాలు క్యూ కట్టాయి. నాగ్‌పూర్, ముంబై, వరంగల్ హైవేలపై కూడా భారీ ట్రాఫిక్ ఏర్పడింది.

## డీఆర్డీఏ కార్యాలయంలో ఏసీబీ రైడ్స్.. రూ.40 లక్షల బదిలీ వ్యవహారంలో పట్టుబడిన అధికారులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గ్రామీణాభివృద్ధి సంస్థలో ఏసీబీ అధికారులు రైడ్ చేశారు. పీఎం కృషి సించాయ్ యోజన పనుల్లో 39 లక్షల14 వేల రూపాయల బదిలీ వ్యవహారంపై వచ్చిన ఫిర్యాదు మేరకు 2026 అక్టోబర్ 22న తనిఖీలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. క్యాలెండర్‌లుచూడండి
లంచం డిమాండ్ చేశారన్న ఫిర్యాదుతో టెక్నికల్ అధికారి రాజు, ప్రాజెక్టు అధికారి సతీష్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నా ఏసీబీ అధికారులు. కోటి 62 లక్షల పనులకు సంబంధించి ఆర్థిక లావాదేవీలపై విచారణ చేపట్టారు.
కోట్ల అవినీతి జరిగిందనే ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో ఉద్యోగులలో ఆందోళన మొదలైంది. పనులకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు.

2లో



## యువతిపై లైంగిక వేదింపులు.. డీఆర్‌డీఓ ఉద్యోగి మృతి

**హైదరాబాద్:**
చిక్కడపల్లిలో దారుణం జరిగింది. ఒంటరిగా ఉ?న్న యువతిపై రామ్మోహన్ అనే డీఆర్‌డీఓ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అతడిపై బాధిత యువతి బంధువు దాడి చేయగా తలకు తీవ్ర గాయాలై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

## కేసీఆర్ ఫామ్ హౌస్ కు నీళ్ల మళ్లింపుపై విచారణ జరిపించండి: ఇరిగేషన్ శాఖకు ఎంపీ చామల లేఖ

మొదటి పేజీ తరువాయి
మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ కు నీళ్ల మళ్లింపుపై విచారణ జరపాలని ఇరిగేషన్ శాఖకు లేఖ రాశారు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. కొండ పోచమ్మ సాగర్ నుంచి ఫామ్ హౌస్ కు నీళ్ల మళ్లింపుపై విచారణ జరపాలని ఇరిగేషన్ శాఖా కార్యదర్శి శ్రీధర్ కు 2026 అక్టోబర్ 22న రాసిన లేఖలో పేర్కొన్నారు.
ప్రజల అవసరాల కోసం ఉపయోగించే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ను వ్యక్తిగత అవసరాల కోసం ఫామ్ హౌస్ కు వాడుకోవడంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరారు. ప్రాజెక్టు రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలిస్తే ప్రజా ధనం ఎంత దుర్వినియోగం అయిందో లెక్క బయటకు వస్తుందని పేర్కొన్నారు.

కొండ పోచమ్మ సాగర్ నుంచి పాండురంగ చెరువుకు అక్కడి నుంచి కేసీఆర్ ఫామ్ హౌస్ కు నీళ్ల తరలింపుపై వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేసి, భాద్యులలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మించి పాండవుల రిజర్వాయర్ నుంచి కేసీఆర్ ఫామ్ హౌస్ కు నీళ్లు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేసీఆర్ ఫామ్ హౌజ్ పక్కనే 58 ఎకరాల్లో పాండురంగ చెరువు తవ్వించారని, 2016కు ముందు అక్కడ ఎలాంటి చెరువు లేదని ఇప్పటికే ఎంపీ చామల గుర్తు చేసిన విషయం తెలిసిందే.
2017లో దీన్ని పూర్తిచేశాక కొండపోచమ్మ సాగర్? నుంచి నీళ్లు మళ్లించి, నింపుకుంటున్నారని విమర్శలున్నాయి. ఇక్కడి నుంచి ప్రత్యేక పైప్ లైన్ల ద్వారా కేసీఆర్ ఫామ్ హౌజ్ లోని 3 ఎకరాల బావికి పంప్ చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ ఇటీవలే ఆరోపించారు.

రైతుల పేరుతో రూ.45 కోట్ల 54 లక్షల ప్రజాధనాన్ని వెచ్చించి వంద శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పెట్టుకున్నారని, ఇది కేసీఆర్ అధికార దుర్వినియోగానికి

## విదేశాల్లో ఉన్నారుగా.. నా మాటలు వినిపించవులే!

మొదటి పేజీ తరువాయి
"మీరు విదేశాల్లో ఉండటంతో నా మాటలు వినలేరని నాకు తెలుసు. మీరు ఎందుకు విదేశాలకు వెళ్తారో చెప్పరు. సరేలే.. అది మీ వ్యక్తిగతం. కానీ ఒకసారి దిల్లీకి తిరిగివచ్చిన తర్వాత నా మాటలు వినండి. మరో 30 ఏళ్ల వరకు మీరు అధికారంలోకి రారు" అని అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

అలాగే, దేశ రాజధానిలో నిరసనల గురించి అమిత్ షా స్పందించారు. నిరసనలు, ప్రదర్శనల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, రాజకీయ నాయకులు ప్రజాసంక్షేమంపై దృష్టిపెట్టాలని సూచించారు. "గుంపులుగా రావడం, రాజకీయ గారడీ వల్ల ప్రజాతీర్పును ధిక్కరించడం సాధ్యం కాదు. ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలి. మీరు ఎన్నికైన చోటల్లా సంక్షేమ పథకాలు అమలు చేయండి. లేదంటే మిగిలిన ప్రాంతాల్లో ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోతారు" అని విపక్ష పార్టీలకు సూచించారు.

"రాహుల్‌జీ.. మీరు చొరబాటుదార్ల ఓట్లను కాపాడాలని అనుకుంటున్నారు కాబట్టే ప్రతిసారి 'ఓటు చోరీ' గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు భాజపాపై ఓటు చోరీ ఆరోపణలు చేస్తున్నాయి. కానీ, ఆ పార్టీలు మాత్రం పలు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉన్నాయి. భాజపా 30 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని నేను చెప్పగానే.. వెంటనే ఓటు చోరీ అంటూ ఆరోపిస్తారు. అమిత్‌షాకు ఎన్నికల ఫలితాలు ముందుగానే ఎలా తెలుస్తాయని అడుగుతుంటారు. అమిత్ షా ఇక్కడే పుట్టారు. ఈ దేశంలోనే నివసిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం నాకు లేదు. నేను ఈ ప్రజల మధ్యే నివసిస్తున్నాను" అంటూ విపక్షాల నిరసనలకు అమిత్ షా కౌంటర్ ఇచ్చారు.

## మెదక్ జిల్లాలో ఏడుగురికి జీవిత ఖైదు

మొదటి పేజీ తరువాయి
పాత కక్షలతో యువకుడిని హత్య చేసిన కేసులో ఏడుగురు నిందితులకు జీవిత ఖైదు పడింది. 2026 అక్టోబర్ 22న వెలువరించిన తీర్పులో నిందితులకు ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు వెల్లడించారు. ఈ విషయాన్ని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ వెల్లడించారు.
క్యాలెండర్‌లుచూడండి
నిజాంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన జెల్లా రాజారామ్ గౌడ్, యాదరం నాగరాజు గౌడ్ కుటుంబాల మధ్య పాత కక్షల కారణంగా గతంలో పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో ఇరు కుటుంబాలపై నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.




2020 మే 20న ఉదయం సుమారు 6.30 గంటలకు రాజారామ్ గౌడ్ కుమారుడు జెల్లా నర్సింలు గౌడ్ (28) గ్రామ శివారులోని బీడు భూమిలో తీవ్ర గాయాలతో పడి ఉండటాన్ని రాజారామ్ గౌడ్ గుర్తించారు. వెంటనే అతడిని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.
కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి నిజాంపేట ఎస్ఐ సుభాష్ గౌడ్ కేసు నమోదు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి, రామాయంపేట సీఐ నాగార్జున గౌడ్ కేసును దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలు సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించగా, ప్రస్తుత దర్యాప్తు అధికారి సైదా, నిజాంపేట ఎస్ఐ సహకారంతో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం ఏడుగురు నిందితులకు జీవిత ఖైదు విధించింది.

**జీవిత ఖైదు పడిన నిందితులు:**
యాదరం నాగరాజు గౌడ్, బంధారం లక్ష్మీ నారాయణ గౌడ్, బంధారం నాగరాజు గౌడ్, బంధారం నవీన్ గౌడ్, బంధారం గణేష్ గౌడ్, యాదరం శేఖర్ గౌడ్, యాదరం రమేష్ గౌడ్.
ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య, కోర్టు లైజన్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్, నిజాంపేట సీడీఓ మహేష్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు. నేరస్తులకు శిక్ష పడేలా ప్రతి కేసులో పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు.

## విద్యార్థులకు అలర్ట్.. 10వ తరగతి 2027 పబ్లిక్ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల..

మొదటి పేజీ తరువాయి
తెలంగాణలో మార్చి-2027లో జరగబోయే ఎస్ఎస్‌సీ మరియు ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్షా ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ అధికారికంగా విడుదల చేశారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు గతంలో ఉత్తీర్ణులు కాని అభ్యర్థులు ఈ ప్రకటన ప్రకారం తమ పరీక్షల ఫీజును నిర్ణీత గడువులోగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. హెడ్ మాస్టర్లు మరియు ప్రిన్సిపాళ్లు తమ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ ఈ సమయాన్ని తక్షణమే తెలియజేసి, అవసరమైన చర్యలు తీసుకోవాలని డైరెక్టరేట్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది.

పరీక్షా ఫీజును ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా అక్టోబర్ 30, 2026 నుండి నవంబర్ 16, 2026 వరకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చెల్లించవచ్చు. రూ. 50 ఆలస్య రుసుముతో నవంబర్ 18 నుండి డిసెంబర్ 01 వరకు చెల్లించే వెసులుబాటు కల్పించారు. అలాగే రూ. 200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 03 నుండి డిసెంబర్ 14 వరకు, రూ. 500 గరిష్ట ఆలస్య రుసుముతో డిసెంబర్ 16 నుండి డిసెంబర్ 28, 2026 వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపింది. ఫీజు వివరాలను పరిశీలిస్తే.. అన్ని సబ్జెక్టులకు కలిపి ఫీజు రూ. 125 కాగా, మూడు సబ్జెక్టుల వరకు అయితే రూ. 110గా నిర్ణయించారు. ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజు రూ. 125కి అదనంగా మరో రూ. 60 చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు పరీక్షా ఫీజు నుండి మినహాయింపు ఉంటుంది.
ఫీజు చెల్లింపు తేదీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించబోమని అధికారులు ఖరాకండిగా స్పష్టం చేశారు. ఫీజుల చెల్లింపు కేవలం అధికారిక వెబ్‌సైట్ లో స్కూల్ లాగిన్ ద్వారా సైబర్ ట్రెజరీ విధానంలో మాత్రమే జరపాలి. ఎలాంటి పోర్టల్ చలాన్లు లేదా మ్యాన్యువల్ బ్యాంక్ చలాన్లను స్వీకరించబోమని హెచ్చరించారు. విద్యార్థుల సమాచారాన్ని నిర్ణీత గడువులోగా డీఈఓ మరియు డీ+జులకు ఆన్‌లైన్ ద్వారా హెచ్ఎంలు సమర్పించాల్సి ఉంటుంది. చివరి నిమిషంలో ఇబ్బందులు పడకుండా ముందే ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించవచ్చు లేదా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

## పండుగ సాయన్న పోరాటం ఎందరికో ఆదర్శం

మొదటి పేజీ తరువాయి
"ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలు నిర్మిస్తాం. సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీని స్మరించుకుంటున్నాం. అందెశ్రీ, గద్దర్‌కు అండగా నిలిచాం. కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా ముదిరాజ్‌లదే. గతంలో నాకు వారు చేసిన సాయం ఎప్పటికీ గుర్తుంచుకుంటా. వారికి సంపూర్ణ న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నా. మా ప్రభుత్వం వచ్చాక ముదిరాజ్ బిడ్డలకు అనేక అవకాశాలు కల్పించాం. నేను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మంత్రి వాకిటి శ్రీహరికి రాజకీయంగా అవకాశం కల్పించా. మిగతా ముదిరాజ్ నేతలకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయి.

జనగణనలో కులగణన చేసి వందేళ్లలో ఎవరూ చేయని పనిని మా ప్రభుత్వం పూర్తిచేసింది. ఏడాదిలోనే కులగణన పూర్తిచేసి దేశానికే ఆదర్శంగా నిలిచాం. బీసీ డి నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్‌లు కోరుతున్నారు. బీసీ సామాజికవర్గాలకు న్యాయం చేయాలనేదే మా ప్రభుత్వం లక్ష్యం. ఎందరు ప్రధానులు మారినా ఎస్సీ కులాల వర్గీకరణ జరగలేదు. దాన్ని కూడా చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచాం. గత ప్రభుత్వాలు ఇచ్చిన సంక్షేమ పథకాలను రెండింతలు పెంచి ఇస్తున్నాం. రాష్ట్రంలో 3.48కోట్ల మంది పేదలకు సన్న బియ్యం ఇస్తున్నాం. ఎల్‌నినో కారణంగా ఇవాళ మార్కెట్‌లో సన్నబియ్యం రేట్లు పెరిగాయి. అనేక మంది పేదలు రేషన్ సన్నబియ్యం తింటున్నారు. ఎన్నికల్లో అండగా ఉండండి.. మీకు ఏం కావాలో నేను చూసుకుంటా" అని సీఎం రేవంత్ అన్నారు.

## ఖిల్లా వరంగల్ అభివృద్ధికి పరిపాలన అనుమతులు

మొదటి పేజీ తరువాయి
హనుమకొండ కోర్ ఏరియా, ఖిల్లా వరంగల్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. రూ.382 కోట్లతో ఖిల్లా వరంగల్, సెంట్రల్ ప్లాజా, బస్ టెర్మినల్, వెయ్యి స్తంభాల గుడి, మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుమతిచ్చింది. ప్రపంచ బ్యాంకు నిధులతో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ అభివృద్ధి పనులు చేపట్టనుంది.

## పాలమూరు నుంచి డిండికి నీటి తరలింపును ఆపండి: ప్రభుత్వానికి విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి
పాలమూరు నుంచి డిండి ప్రాజెక్టుకు నీటి తరలింపును ఆపాలని జిల్లా ప్రతినిధులు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జానారెడ్డి తదితరులు గురువారం ఉత్తమ్‌తో సమావేశమయ్యారు. దాదాపు గంటన్నరపాటు చర్చించారు. డిండి ప్రాజెక్టు విషయంలో ఇబ్బందులను ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల నుంచి కాకుండా వేరే మార్గం ద్వారా నీటిని తీసుకోవాలని కోరారు. డిండి ప్రాజెక్టుకు నీరు ఇచ్చేందుకు తాము వ్యతిరేకం కాదని, ఏదుల నుంచి నీటిని తీసుకుంటే పాలమూరు ఆయకట్టుకు ఇక్కట్లు ఎదురవుతాయని చెప్పారు. అధికారులతో చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఉత్తమ్ హామీ ఇచ్చారు.

## ప్రకృతితో మమేకం కాకపోతే.. విపత్తులు తప్పవు

మొదటి పేజీ తరువాయి
ఈ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా పలు పార్టీల నేతలు హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు సహా పలువురు భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ సహా పలు పార్టీల నేతలు సైతం తరలివచ్చారు. మనుషుల మధ్య ఐక్యతను పెంపొందించే కార్యక్రమమే అలయ్ బలయ్ అని ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు చెప్పారు. సెక్యులర్ దేశంలో ఏ మతాన్నీ, ఏ పండగనూ తక్కువ చేసి చూడొద్దని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. వికసిత్ భారత్ మనందరి లక్ష్యం కావాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. అలయ్ బలయ్ అనేది కులమతాలు, రాజకీయాలు, ప్రాంతాలకు అతీతమైన వేదికని దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి పేర్కొన్నారు.

## ఇన్‌స్టాలోకి సోనియా గాంధీ.. తొలి పోస్టు ఇదే

మొదటి పేజీ తరువాయి
'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఫస్ట్‌లుక్‌ను మీతో షేర్ చేసుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. ఈ కథ ప్రేమ, కర్తవ్యం, నష్టం వంటి ఎన్నో ఉద్వేగాలను తెలియజేస్తోంది" అంటూ తన కుమార్తె ప్రియాంకాగాంధీ, పబ్లిషర్లతో ఉన్న వీడియోను పంచుకున్నారు. నవంబర్ 10న ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది.

## యువతిపై లైంగిక వేధింపులు.. డీఆర్‌డీఓ ఉద్యోగి మృతి

మొదటి పేజీ తరువాయి
వివరాల్లోకి వెళితే.. చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం వీధిలో రెండేళ్లుగా నివాసముంటున్న రామ్మోహన్ (55) డిఆర్‌డీఓలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు గత కొంతకాలంగా ఇంటి పక్కనే ఉన్న ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడు.
ఈ క్రమంలో రాత్రి కూడా రామ్మోహన్ యువతిని వేధించడంతో పక్కనే నివాసం ఉంటున్న తన బంధువైన అభిజిత్‌కు విషయం చెప్పింది. ఎందుకు వేధిస్తున్నావని రామ్మోహన్‌ను అభిజిత్ నిలదీశాడు. ఇరువురి మధ్య మాట మాట పెరిగి గొడవ జరగడంతో రామ్మోహన్‌ను అభిజిత్ తోసేసాడు.
తలకు గాయాలైన రామ్మోహన్‌ను చికిత్స నిమిత్తం కాచిగూడ లోని సీసీ షరాఫ్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. చికిత్స పొందుతూ అతడు ఈరోజు చనిపోయినట్టు చిక్కడపల్లి పోలీసులు తెలిపారు. రామ్మోహన్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రేహాన్ వాద్రా 'నిరసనల ఫొటోల వివాదం'.. స్పందించిన బికనేర్ హౌస్

మొదటి పేజీ తరువాయి
నాయకురాలు ప్రియాంకా గాంధీ కుమారుడు రేహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్ రాజకీయంగా వివాదానికి దారితీసింది. దిల్లీలోని బికనేర్ హౌస్‌లో 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరిట ఆయన తీసిన కొన్ని ఫొటోలను ఎగ్జిబిషన్‌కు ఉంచగా.. వాటిలో కొన్నింటిని తొలగించాలని నిర్వాహకులు కోరడంతో కాంగ్రెస్, భాజపా మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో బికనేర్ హౌస్ స్పష్టతనిచ్చింది.

'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరిట రేహాన్ తాను తీసిన ఫొటోలను తొలిసారి ప్రదర్శనకు ఉంచారు. వన్యప్రాణులు సహా ఇతర థీమ్‌లు, దిల్లీలో జరిగిన నిరసనలను ఫొటోలు తీసి ఎగ్జిబిషన్‌లో ఉంచారు. ఆ ఫొటోల్లో కొన్ని రాజకీయ ఉద్దేశాన్ని కలిగి ఉన్నాయని, సంస్థ విధానానికి వ్యతిరేకమంటూ బికనేర్ హౌస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. కళలు, సంస్కృతిని ప్రతిబింబించేవాటిని మాత్రమే ప్రదర్శనకు ఉంచాలని, అందుకే వాటిని తొలగించాలని కోరినట్లు చెప్పింది. ప్రదర్శన ప్రారంభం కావడానికి కొన్ని గంటల ముందే తన ప్రదర్శించిన ఫొటోల్లో చాలావరకు తొలగించాలని, రద్దు చేసుకోవాలని నిర్వాహకులు చెప్పినట్లు వాద్రా సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. అందులో రెచ్చగొట్టేవి ఏవీ లేవన్నారు. కళాకారుల భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేయడం సరికాదన్నారు. దీంతో భాజపా కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం మొదలైంది.

## హైదరాబాద్ బాట పట్టిన జనాలు.. పంతంగి టోల్ ప్లాజా నుంచి దిల్ సుఖ్ నగర్ వరకు భారీ ట్రాఫిక్

మొదటి పేజీ తరువాయి
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జిల్లాల నుంచి (మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి) తిరిగి వస్తున్న ప్రయాణికులతో రోడ్లు నిండిపోయాయి.
ఎల్‌బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో చేరడంతో భారీ ట్రాఫిక్ ఏర్పడింది. దీనివల్ల ప్రయాణికులకు ఇబ్బంది కలిగింది. చాలా మంది సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోయారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కీలక జంక్షన్ల దగ్గర ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ను నియంత్రిస్తున్నారు.
అదే సమయంలో ట్యాంక్‌బండ్, చుట్టుపక్కల ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాల నిమజ్జనంతో ట్రాఫిక్ ఏర్పడుతోంది. నిమజ్జన ఊరేగింపుల కారణంగా నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్)కు వెళ్లే ప్రయాణికులను దిల్‌సుఖ్‌నగర్ దగ్గర దిగి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.
స్కూల్స్ కాలేజీలు గురువారం నుంచి తిరిగి ప్రారంభం కావడంతో అందరూ హైదరాబాద్ బాట పట్టారు. దీంతో సిటీలోని రోడ్లపై ట్రాఫిక్ పెరిగింది. నిమజ్జన ఏర్పాట్ల కోసం విధించిన ట్రాఫిక్ ఆంక్షలు కొన్ని చోట్ల ఎత్తివేసినా కొన్ని రోడ్లపై

## పండుగ సాయన్నకు ఘనంగా నివాళులు అర్పించిన రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్

**పండుగ సాయన్న 174 జయంతి వేడుకలు**

**పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకం: రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్**

**ప్రజా పోరాట యోధుల చరిత్రకు గుర్తింపు ఇవ్వడం అభినందనీయం: మహిళా అధ్యక్షులు సుజాత**





తెలంగాణ ప్రజల కోసం పోరాడిన పండుగ సాయన్న జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆయన చరిత్రకు దక్కిన గొప్ప గౌరవమని ప్రజా పోరాట యోధుల జీవితాలను గుర్తించి, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించడంలో చొరవ అభినందనీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం లో దౌల్తాబాద్ ఎస్ఎస్ఆర్ గార్డెన్లో నిర్వహించిన 174 వ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు రాజేందర్ ముదిరాజ్ అంబటి అర్జున్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నీలం మధు. మాట్లాడుతూ... తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రజల హృదయాల్లో నిలిచిన పండుగ సాయన్నకు అధికారికంగా గుర్తింపు కల్పించిన నీలం మధు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పండుగ సాయన్న వంటి ప్రజా పోరాట యోధుల చరిత్రను కేవలం జయంతి వేడుకలకే పరిమితం చేయకుండా, వారి జీవిత విశేషాలను యువతకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. సమాజంలో అన్యాయాలను ఎదిరించి, పేదల పక్షాన నిలిచిన మహనీయుల చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా సామాజిక చైతన్యాన్ని పెంపొందించవచ్చన్నారు.

తెలంగాణ చరిత్రలో పండుగ సాయన్న ప్రజల కోసం పోరాడిన వీరుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారని వివరించారు. అప్పటి సామాజిక పరిస్థితుల్లో పేదలు, బలహీన వర్గాలు ఎదుర్కొన్న దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం ప్రజల్లో విశేష ఆదరణ పొందిందన్నారు. ప్రజల్లో ప్రాచుర్యంలో ఉన్న కథనాల ప్రకారం, సంపన్నుల నుంచి సంపదను తీసుకుని పేదలకు పంచేవాడిగా సాయన్న పేరు గావించారని అందుకే ఆయనను ప్రజలు ప్రేమతో తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పిలుచుకుంటారన్నారు.

పండుగ సాయన్న జీవితం సామాజిక న్యాయం, సమానత్వం, పేదల పట్ల బాధ్యత వంటి విలువలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. అన్యాయాన్ని ప్రశ్నించడం, బలహీనులకు అండగా నిలవడం, ప్రజల హక్కుల కోసం పోరాడడం వంటి అంశాలు సాయన్న చరిత్రలో కనిపిస్తాయని పేర్కొన్నారు. నేటి తరానికి ఆయన జీవిత విశేషాలను తెలియజేయడం ద్వారా సామాజిక బాధ్యత, సేవాభావం వంటి స్ఫూర్తిదాయకమైన విలువలను అందించవచ్చన్నారు.పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం ఈ దిశగా ఒక మంచి అడుగుగా అభివర్ణించారు.

ప్రజల కోసం పోరాడిన వీరుల జీవితాలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని, పండుగ సాయన్న స్ఫూర్తి యువతలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర నాయకులు మెదక్ మహిళ అధ్యక్షురాలు సుజాత నియోజకవర్గ నాయకులు వివిధ మండలాల సీనియర్ నాయకులు, గ్రామాల కర్రే కృష్ణ ముదిరాజు, సత్యం ముదిరాజ్ తలారి యాదగిరి ముదిరాజ్ కోలాన్ రవి ముదిరాజ్ కోలాలక్ష్మణ్ ముదిరాజ్ సోమక్కపేట్ లక్ష్మణ్, కొన్యాల సతీష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు..

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలి

**పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి**





రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని బూత్ స్థాయి నుంచి పకడ్బందీగా చేపట్టాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి పార్టీ నాయకులు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు.గురువారం శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,వాణిజ్యం, శాసన వ్యవహారాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి హైదరాబాద్,రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డు పరిధిలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, గ్రామ కమిటీలు, బూత్ స్థాయి నాయకులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటరు నమోదు కోసం అభ్యర్థి పంపించే లింక్‌ను వాట్సాప్‌లో ఓపెన్ చేసి, అవసరమైన పత్రాలను సమర్పించడం ద్వారా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరికీ ఈ సమాచారాన్ని చేరవేసి, నమోదు ప్రక్రియలో వారికి సహకరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.ప్రతి బూత్‌కు స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకొని, నాయకులు,కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేయాలని,పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి నుంచి సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే డా.టి. రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# నేనే పోలీస్ నా ఇష్టం వచ్చినట్లు చేస్తా...?

**ఫ్రెండ్లీ పోలీస్ ఎటు పోయింది...?**

**పోలీస్ వ్యవస్థకు భయపడుతున్న స్థానిక ప్రజలు..!**

**కాల కృత్యాలకు కూడా చెకింగ్ చేస్తున్న పోలీస్...!**

**100 మీటర్లకు కూడా హెల్మెట్ తప్పదా...?**

**ఉన్నతాధికారుల సమక్షంలో నేనా హోంగార్డుల సొంత నిర్ణయమా...!**

**నేను పోలీస్ ఆఫీసర్ నువ్వేం చేయలేవు అంటూ బెదిరింపులు**



ఇటీవలే సాధారణ మానవుడు మోటార్ సైకిల్ తో అడుగు దూరం బయటకు వేయాలన్న భయభ్రాంతులకు గురవుతున్న పరిస్థితి మండలంలో అనేకంగానే ఏర్పడుతున్నాయి,

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ విషయంలో కానీ, హెల్మెట్ , సీట్ బెల్టు, పత్రాలు తనిఖీలు అసలు ఏ అధికారి పరిశీలన చేస్తున్నారన్న సందేహాలు కూడా సందిగ్ధంలోనే ఉండిపోయాయి,

ఇదంతా ఓ పరిపూర్ణంగా మారితే తనిఖీ చేస్తున్న అధికారుల వ్యవహార తీరు హద్దులు దాటుతుంది,

ఇటీవల సెంట్ మేరీ స్కూల్ వద్ద తనిఖీలు నిర్వహించిన పోలీస్ శాఖ,

ఓ పాత్రికేయుడు వాహనాన్ని ఆపారు, పత్రాలు తనిఖీ చేశారు హెల్మెంట్ లేదని ఫోటోలు తీశారు,

అదంతా వ్యవహారశీలిగా మారితే ఉన్నత స్థాయి అధికారులు లేకుండా ఇదేమిటని ప్రశ్నించిన పత్రిక ఆశ్చర్యమే మిగిలింది, పాత్రికేయుడు వెంటనే చిత్రీకరించనున్న సమయంలో అక్కడి నుంచి పోలీసు అధికారులు ఉడాయించారు,

ఇంతవరకు తనిఖీ చేస్తున్న అధికారులు ఎందుకు పారిపోయారు అని స్థానిక ప్రజలు సైతం ఆశ్చర్యం లో ఉండిపోయారు,

అర్థం కాని పరిస్థితులు సందిగ్ధంగా మారితే, ఉన్నత స్థాయి పై అధికారులు పరిశోధన లేకపోవడంతోనే ఇష్టాను రీతిలో వ్యవహరిస్తున్న తీరు మండలంలో ప్రత్యక్షంగా స్పష్టం అవుతుంది,

ఏది ఏమైనాప్పటికీ పాత్రికేయుడైన తెలియక పాత్రికేయుడి వాహనాన్ని ప్రశ్నించిన సమయంలోనే పారిపోయిన సమయం పై అర్థం కాని ప్రశ్నలు అనేకంగానే వెలువెత్తుతున్నాయి,

ఎప్పటిలాగానే పరిశోధన చేయాల్సిన పోలీసు అధికారులు మౌనం పై అనేక ప్రశ్నలు కూడా పరిపూర్ణమవుతున్నాయి,

ఇదంతా నెలవారీ కేసులో నమోదు కోసమా, లేకుంటే ఏదైనా ప్రలోభం కోసమా, అనే అనుమానాలు కూడా అనేకంగానే మండలంలో స్పష్టమవుతున్నాయి ,

వ్యవహారశీలి రూపుదారుచుకుంటే ఎప్పటిలాగే పరిశోధన చేసే నిజాయితీకి మారుపేరైన పోలీసు అధికారులు నిజమైన దొంగలను, అక్రమార్కులను, దొడ్డిదరణ వ్యవహరించే వ్యాపారస్తులను అడ్డుకోనటంలో ఎందుకు నిర్లక్ష్యత వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆశ్చర్యభావం వ్యక్తం చేస్తున్నారు,

ఇదంతా సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలోనే జరుగుతుందా లేకుంటే ఎవరి ప్రలోభాన్ని వారు చూపిస్తున్నారా అనే అనుమానాలు కూడా అనేక కోణంలో మండల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు

## విధి నిర్వహణలో సహచరుడిని కోల్పోయిన పోలీస్ సిబ్బంది...

**మృత హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ. 2.83 లక్షల ఆర్థిక సాయం**





కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన బి. పెంటయ్య కుటుంబానికి తోటి పోలీస్ సిబ్బంది అండగా నిలిచారు. మానవత్వంతో స్పందించిన సహచరులు, బ్యాచ్‌మేట్స్ కలిసి మొత్తం రూ. 2,83,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ పరిధిలోని శివాజీ నగర్, బాలాజీ నగర్‌కు చెందిన బి. పెంటయ్య (50) 2022 ఆగస్టు 15 నుంచి కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, 2026 ఆగస్టు 31న ఉదయం సుమారు 7 గంటల సమయంలో అనారోగ్య సమస్యల కారణంగా తన నివాసంలో అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను ఏఎస్ రావు నగర్‌లోని జెమ్‌కేర్ పౌలమి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ నేపథ్యంలో మృతుని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది రూ. 1,14,500, ఆయన బ్యాచ్‌మేట్స్ రూ. 1,69,000 సమకూర్చారు. మొత్తం రూ. 2,83,500 నగదును పెంటయ్య భార్య శ్రీమతి బి. రాజమణికి ఆమె నివాసంలో అందజేశారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, పెంటయ్య కుటుంబానికి రావాల్సిన సర్వీస్ పరమైన ఇతర అర్హత కలిగిన ప్రయోజనాలు త్వరితగతిన అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చి. నరేందర్ రావు, ఇన్‌స్పెక్టర్ జి. మల్లేష్, లింగారెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది, మృతుని బ్యాచ్‌మేట్స్ పాల్గొన్నారు.

## పరిగి లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు





తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలను పరిగి పట్టణంలోని పండుగ సాయన్న విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పరిగి శాసనసభ్యులు డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, వైస్ చైర్మన్ హనుమంతు కమల్ పాల్గొని పండుగ సాయన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా, దొరల దౌర్జన్యాలపై పోరాడిన తెలంగాణ తొలి యోధుడు పండుగ సాయన్న అని ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.పండుగ సాయన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పరిగి మండలాధ్యక్షుడు వెంకట రాములు, పట్టణాధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి,లాల్ కృష్ణ ప్రసాద్,రాజా పుల్లారెడ్డి, కౌన్సిలర్లు యూసుఫ్,అభిబ్ ఉన్నిసా అయూబ్,ఆరిఫ్ పటేల్, కొడంగల్ ఆనంద్, దండు అశోక్,మిట్టకోడూరు మాణిక్యం,చిన్న నరసింహులు, దోమ మండల అధ్యక్షులు శాంత్ కుమార్,రవికాంత్ రెడ్డి, విద్యాసాగర్,ముదిరాజ్ సంఘం దోమ శ్రీనివాస్,కుడుముల యాదయ్య, ముకుంద నాగేశ్వర్, రాజు,నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్నుడికి అండగా చిలకలగూడ పోలీసులు నిరాశ్రయుడిని ఆశ్రమానికి తరలింపు

రోడ్డుపై నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తికి చిలకలగూడ పోలీసులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం పద్మారావునగర్‌లోని ఎస్వీ కాలేజీ ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఉన్న సుమారు 45 ఏళ్ల సాగర్ కుమార్ గుప్తా గురించి స్థానికులు పోలీసులకు



సమాచారం అందించారు.వెంటనే స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకుని విచారించగా, ఆ వ్యక్తి తన కుటుంబ వివరాలు, చిరునామా వెల్లడించలేకపోయాడు. దీంతో చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ వి. రామకృష్ణ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ సిబ్బంది అతడిని యాప్రాల్‌లోని 'సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్' ఆశ్రమానికి సురక్షితంగా తరలించారు.ఆపదలో ఉన్నవారికి, నిరాశ్రయులకు అండగా నిలిచి అవసరమైన సహాయం అందించేందుకు పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని సీఐ తెలిపారు. పోలీసుల మానవతా దృక్పథంపై స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ రిపోర్టర్ దొంతి నవీన్

## వరాసిగూడలో చెత్త తొలగింపునకు జీహెచ్ఎంసీ చర్యలు




వరాసిగూడ ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్ లేన్‌లో చెత్తాచెదారం, మ్యాన్‌హోళ్ల సమస్యలపై అందిన ఫిర్యాదుల మేరకు జీఎస్ఆర్ బృందం సభ్యుడు సయ్యద్ సద్దాం చొరవ తీసుకున్నారు. దీంతో స్పందించిన జీహెచ్ఎంసీ ఏఈ వినయ్ కుమార్, మేనేజర్ కుశాల్ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు సిబ్బందిని పంపించారు. ఈ చర్యలు బిఆర్ఎస్ యువ ఐకాన్ తీగుళ్ల రామేశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు చేపట్టినట్లు సద్దాం భాయ్ తెలిపారు. సికింద్రాబాద్ రిపోర్టర్ దొంతి నవీన్

# నవంబర్ 28 నుంచి కాశీ తమిళ సంగమం 5.0

**డిసెంబర్ 12 వరకు కార్యక్రమాలు.. 'తిరుక్కురళ్‌ను అధ్యయనం చేద్దాం' ఇతివృత్తంతో నిర్వహణ**

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 22:**
తమిళనాడు--కాశీ మధ్య ప్రాచీన సాంస్కృతిక, నాగరికత సంబంధాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో కాశీ తమిళ సంగమం ఐదో విడతను నవంబర్ 28 నుంచి డిసెంబర్ 12 వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు నమోదు పోర్టల్‌ను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం ప్రారంభించారు. ఈ ఏడాది 'తిరుక్కురళ్ పయిల్వోమ్--తిరుక్కురళ్ అభ్యాస్ కరేన్' (తిరుక్కురళ్‌ను అధ్యయనం చేద్దాం) అనే ఇతివృత్తాన్ని ఎంచుకున్నారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుంచే భారతదేశంలో బలమైన సాంస్కృతిక ఐక్యత ఉందన్నారు. సంప్రదాయ యాత్రల్లో భాగంగా ప్రజలు కాశీ, రామేశ్వరం సందర్శించడం ఉత్తర--దక్షిణ భారత ప్రాంతాల మధ్య ఉన్న అనుబంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశ సమైక్యతను బలోపేతం చేయడంలో, ఉమ్మడి నాగరికత వారసత్వాన్ని చాటిచెప్పడంలో కాశీ తమిళ సంగమం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రచయితలు,



వివిధ వృత్తుల నిపుణులు, రైతులు, కళాకారులు, మహిళలు, ఆధ్యాత్మిక పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. సంగమం లక్ష్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉన్నత విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ఏడు బృందాలుగా 1,400 మంది
తమిళనాడు నుంచి సుమారు 1,400 మందిని ఎంపిక చేసి, ఒక్కో బృందంలో దాదాపు 200 మంది చొప్పున ఏడు బృందాలుగా యాత్రకు తీసుకెళ్లనున్నారు. ప్రతి బృందం ఎనిమిది రోజుల పర్యటనలో పాల్గొంటుంది. ఇందులో నాలుగు రోజులు ప్రయాణానికి, మరో నాలుగు రోజులు సందర్శనలు, ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలకు కేటాయించారు. వారణాసి, ప్రయాగ్‌రాజ్, అయోధ్యలో సాంస్కృతిక, విద్యా, రంగాలవారీ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరుక్కురళ్‌లోని నైతిక విలువలను యువతకు చేరువ చేయడం ఈ విడత ప్రత్యేకత. బహుభాషా వనరులు, విద్యా కార్యక్రమాలు, ప్రజా అవగాహన ద్వారా తిరుక్కురళ్‌ను చదవడం, అర్థం చేసుకోవడం, అందులోని విశ్వజనీన విలువలను నిత్యజీవితంలో ఆచరించడాన్ని ప్రోత్సహించనున్నారు. 2022లో ప్రారంభమైన కాశీ తమిళ సంగమం గత నాలుగు విడతల్లో రెండు ప్రాంతాల మధ్య భాష, విజ్ఞానం, సంప్రదాయాలు, జీవన అనుభవాల పరస్పర మార్పిడికి వేదికగా నిలిచింది. కేంద్ర విద్యాశాఖ ఉన్నత విద్యా విభాగం ఆధ్వర్యంలో ఐఐటీ మద్రాస్, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

# పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం..

## అని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మంత్రి ఆదేశం

**పత్తి రైతుకు ధరల భరోసా కల్పించాలి..**
**అధికారులకు తుమ్మల దిశానిర్దేశం**
**పత్తి మార్కెట్లలో ధరల వ్యత్యాసంపై సమీక్ష.. స్పిన్నింగ్, ప్రాసెసింగ్ పరిశ్రమల విస్తరణకు చర్యలు చేపట్టాలి**

**హైదరాబాద్, త్రినెట్ న్యూస్,**
అక్టోబర్ 22: రాష్ట్రంలో 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోలు కేంద్రాలను గత ఏడాది మాదిరిగానే ప్రారంభించి, రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మరియు చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి అంచనాలు, మార్కెట్ ధరలు, సీసీఐ కొనుగోళ్లకు చేసిన ఏర్పాట్లు, రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై సమీక్షించారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడటం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవడం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుత 2026-27 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 48.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, 29.43 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. గత సీజన్‌లో 50.73 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, 28.33 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది.

దేశవ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 271.06 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, 133.04 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా. గత సీజన్‌లో 148.02 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం సహా ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తి ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో, రాష్ట్రంలో కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి సూచించారు.

కనీస మద్దతు ధర రూ.8,667.. రైతులకు ధరల భరోసా
కేంద్ర ప్రభుత్వం 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.8,667గా ప్రకటించింది. ప్రస్తుతం తెలంగాణలో పత్తి మోడల్ మార్కెట్ ధర సుమారు రూ.9,000గా ఉందని అధికారులు వివరించారు. ఇది కనీస మద్దతు ధర కంటే రూ.333 అధికం.

మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు బహిరంగ మార్కెట్లో విక్రయించుకోవచ్చని, ధరలు తగ్గి కనీస మద్దతు ధర కంటే దిగువకు వచ్చినప్పుడు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

పత్తిలో తేమ శాతం, నాణ్యత ఆధారంగా సీసీఐ నిబంధనల ప్రకారం కొనుగోలు ధర నిర్ణయిస్తారని, రైతులు పత్తిని విక్రయించే ముందు నాణ్యత ప్రమాణాలు, తేమ శాతాన్ని పరిశీలించుకోవాలని సూచించారు.



335 జిన్నింగ్ మిల్లులు కొనుగోలు కేంద్రాలుగా నోటిఫైలి
2026-27 సీజన్‌లో పత్తి కొనుగోళ్ల కోసం సీసీఐ గత సీజన్‌లో ఉన్న 122 కొనుగోలు కేంద్రాల సంఖ్యను 133కు పెంచింది. రాష్ట్రంలో రోజుకు 1,09,035 బేళ్ల సామర్థ్యంతో 356 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఇప్పటివరకు 30 జిల్లాల్లో 335 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు అధికారులు తెలిపారు.

పత్తి కొనుగోళ్లకు సంబంధించి 11-08-2026న రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించి, సీసీఐ, సంబంధిత శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులకు అవసరమైన సూచనలు ఇచ్చినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పత్తి నాణ్యత పరీక్షలు, జిన్నింగ్, బేళ్ల తయారీ, గోదాములకు రవాణా, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీలు పత్తి మార్కెట్ ధరలు, కొనుగోళ్ల పురోగతి, కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు.

దేశంలోని ఇతర ప్రధాన పత్తి మార్కెట్లతో పోలిస్తే తెలంగాణలో కొన్ని మార్కెట్లలో ధరలు తక్కువగా ఉండటానికి గల కారణాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పత్తి గింజల ప్రాసెసింగ్ యూనిట్లు, స్పిన్నింగ్ పరిశ్రమల సంఖ్య, సామర్థ్యం తక్కువగా ఉండటం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని అధికారులు వివరించారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పత్తి ప్రాసెసింగ్, స్పిన్నింగ్, ఆయిల్ పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ఇతర రాష్ట్రాల్లో పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలు, సౌకర్యాల వివరాలను సేకరించి, తెలంగాణలో పత్తి ఆధారిత పరిశ్రమల విస్తరణకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మార్కెటింగ్ శాఖ, సీసీఐ అధికారులు బహిరంగ మార్కెట్లో పత్తి ధరలను ప్రతిరోజూ సమీక్షిస్తూ, ధరల వ్యత్యాసాలకు గల కారణాలను విశ్లేషించాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పత్తి ప్రాసెసింగ్ సామర్థ్యం పెరిగితే స్థానికంగా పత్తికి డిమాండ్ పెరిగి, రైతులకు మెరుగైన ధరలు లభించే అవకాశాలు ఉంటాయని తెలిపారు.

నాణ్యమైన పత్తి సేకరణపై ప్రత్యేక దృష్టి
పత్తి కొనుగోళ్లలో తెలంగాణ దేశంలో ముందంజలో ఉండటానికి రాష్ట్రంలో పండించే నాణ్యమైన పత్తి ప్రధాన కారణమని మంత్రి పేర్కొన్నారు. రైతులు పండించిన పత్తిని సేకరించి మార్కెట్లకు తరలించే సమయంలో నాణ్యత దెబ్బతినకుండా రైతులకు అవగాహన కల్పించాలని, కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను కాపాడటం ద్వారా రైతులకు మెరుగైన ధర లభించడంతో పాటు సీసీఐ కొనుగోళ్లు కూడా సజావుగా సాగుతాయని తెలిపారు.

కపాస్ కిసాన్ యాప్‌తో రైతులకు సౌలభ్యంలి
పత్తి కొనుగోళ్లలో పారదర్శకత పెంచేందుకు కపాస్ కిసాన్ యాప్, ఆన్‌లైన్ చెల్లింపులు, రైతుల వివరాల ధ్రువీకరణ వంటి డిజిటల్ విధానాలను అమలు చేస్తున్నారు. అక్టోబర్ 21 నాటికి 12,75,185 మంది రైతులకు సంబంధించిన 21,58,938 వివరాలను కపాస్ కిసాన్ యాప్‌తో అనుసంధానం చేసినట్లు అధికారులు తెలిపారు.

రైతులు పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే ముందు యాప్‌లో నమోదైన వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. జిల్లాకు నిర్ణయించిన సగటు దిగుబడి కంటే ఎక్కువ పత్తి దిగుబడి ఉన్న రైతులు అదనపు దిగుబడి ధ్రువీకరణ కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ను సంప్రదించాలి. కౌలు రైతులు తమ పేర్ల నమోదు కోసం సంబంధిత ఏఈఓ ను సంప్రదించి, అవసరమైన భూమి, ఆధార్, మొబైల్ వివరాలను అందించాలని అధికారులు సూచించారు. భూ యజమాని ధ్రువీకరణ అనంతరం నమోదు ప్రక్రియ పూర్తవుతుంది.

టోల్‌ఫ్రీ, వాట్సాప్ సేవలు అందుబాటులోకి
పత్తి రైతులకు సమాచారం, సహాయం అందించేందుకు మార్కెటింగ్ శాఖ 1800-599-5779 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అలాగే 8897281111 వాట్సాప్ నంబర్ ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను తెలుసుకునే సౌకర్యం కల్పించింది.

ఈ సేవల ద్వారా రైతులు సీసీఐ ద్వారా ఎంత పత్తి విక్రయించవచ్చో, విక్రయించిన పంట విలువ, చెల్లింపుల స్థితి, కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండే సమయం తదితర వివరాలను తెలుసుకోవచ్చు. అన్ని మార్కెట్ యార్డుల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి, కొనుగోలు కేంద్రాల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందు తేమ శాతాన్ని పరీక్షించుకునేందుకు రాష్ట్రంలోని రైతు వేదికల వద్ద మాయిశ్చర్ మీటర్లను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

రైతులకు మంత్రి విజ్ఞప్తి
రైతులు ప్రస్తుత మార్కెట్ ధరలను పరిశీలించి, కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తున్నప్పుడు బహిరంగ మార్కెట్లో పత్తిని విక్రయించుకోవాలని మంత్రి సూచించారు. మార్కెట్ ధర తగ్గినప్పుడు సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగా పత్తిని విక్రయించుకోవాలని కోరారు. పత్తి కొనుగోళ్లలో పారదర్శకత, రైతులకు ధరల భరోసా, సకాలంలో చెల్లింపులు, కొనుగోలు కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

# ఘనంగా ముగిసిన బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ సార్వజనిన్ దుర్గాపూజ వేడుకలు

**హైదరాబాద్, అక్టోబర్ 22:**

బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ (బీసీఏ) హైదరాబాద్ ఆధ్వర్యంలో అక్టోబర్ 15 నుంచి 20వ తేదీ వరకు బంజారా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 53వ సార్వజనిన్ దుర్గాపూజ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఆరు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన బెంగాలీ సమాజ సభ్యులు, వివిధ సంస్కృతులకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక ఐక్యత, సామాజిక సమైక్యతకు ఈ వేడుకలు ప్రతీకగా నిలిచాయి.

ఈ సందర్భంగా బీసీఏ అధ్యక్షుడు సంజయ్ పాన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది దుర్గాపూజ వేడుకల్లో భక్తి, సంప్రదాయం, సంస్కృతి, సామాజిక ఐక్యతగా నిలిచాయని తెలిపారు. పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ బెంగాలీ వంటకాలు, పండుగ సందడి ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. బీసీఏ కార్యవర్గ సభ్యుడు బిప్లబ్ ముఖోపాధ్యాయ్ మాట్లాడుతూ.. సందర్శకులందరికీ సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



ముఖ్య అతిథిగా నవీన్ మిట్టల్
తెలంగాణ ప్రభుత్వ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారని వివరించారు. ఐదు దశాబ్దాలకు పైగా సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షిస్తూ, ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువస్తున్న బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ సేవలను ఆయన అభినందించారు. సంస్థ సహాయ ప్రధాన కార్యదర్శి, పీఆర్ --మీడియా సమన్వయకర్త



డాక్టర్ త్రిషీతా ముఖర్జీ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల ద్వారా సంస్థ కార్యక్రమాల గురించి తెలుసుకుని ఈ ఏడాది పలువురు కొత్తవారు వేడుకల్లో పాల్గొన్నారని, సంస్థతో అనుబంధం ఏర్పరచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

# ఇండియా పోస్ట్ చరిత్రాత్మక రికార్డు




**వరుసగా రెండు త్రైమాసికాల్లో 4 వేల కోట్లకు పైగా ఆదాయం**
**అర్ధవార్షిక ఆదాయం 8,212.7 కోట్లు.. పార్సిల్ విభాగంలో 71 శాతం వృద్ధి**

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 22:**
భారత తపాలా శాఖ చరిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. తొలిసారిగా వరుసగా రెండు త్రైమాసికాల్లో 4 వేల కోట్లకు పైగా ఆదాయాన్ని నమోదు చేసింది. 2026--27 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ?8,212.7 కోట్ల ఆదాయం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నమోదైన ?6,636 కోట్లతో పోలిస్తే 24 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు శాఖ వెల్లడించింది. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా అధ్యక్షతన గురువారం న్యూఢిల్లీలో తపాలా శాఖ రెండో త్రైమాసిక సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తపాలా శాఖ కార్యదర్శి సుబ్రత్ దాస్, పోస్టల్ సర్వీసెస్ బోర్డు సభ్యులు, వివిధ పోస్టల్ సర్కిళ్ల చీఫ్ పోస్ట్‌మాస్టర్స్ జనరల్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జూలై--సెప్టెంబర్ రెండో త్రైమాసికంలో శాఖ ?4,201.5 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 25 శాతం, ప్రస్తుత ఏడాది తొలి త్రైమాసికంతో పోలిస్తే 5 శాతం వృద్ధి సాధించింది.

**పార్సిల్ సేవల్లో భారీ వృద్ధి**
గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే పార్సిల్ విభాగం 71 శాతం వృద్ధిని నమోదు చేసింది. రెండో త్రైమాసికంలో ఈ విభాగం ద్వారా ?318.9 కోట్ల ఆదాయం లభించింది. కేరళ, ఈశాన్య, ఉత్తరప్రదేశ్, బిహార్ సర్కిళ్లు తమ త్రైమాసిక లక్ష్యాలను అధిగమించాయి. తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా విభాగాలు 44 శాతం, మెయిల్స్ 36 శాతం, పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ 18 శాతం, అంతర్జాతీయ సంబంధాలు--గ్లోబల్ బిజినెస్ విభాగం 38 శాతం వృద్ధి సాధించాయి.

పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ ద్వారా ?1,987 కోట్ల ఆదాయం సమకూరింది. మెయిల్స్ ఆదాయం తొలి త్రైమాసికంతో పోలిస్తే 26 శాతం పెరగగా, 12 పోస్టల్ సర్కిళ్లు రెండో త్రైమాసిక లక్ష్యాలను చేరుకున్నాయి లేదా అధిగమించాయి.

**ఆంధ్రప్రదేశ్, బిహార్ సర్కిళ్లకు గుర్తింపు**
రెండో త్రైమాసిక లక్ష్యాల సాధనలో బిహార్ 97.15 శాతంతో ముందంజలో నిలిచింది. పశ్చిమ బెంగాల్ 97.07 శాతం, ఈశాన్య సర్కిల్ 94.79 శాతం సాధించాయి. తొలి అర్ధవార్షిక లక్ష్యాల సాధనలో పశ్చిమ బెంగాల్ 95.72 శాతం, బిహార్ 95.12 శాతం, ఆంధ్రప్రదేశ్ 94.63 శాతంతో నిలిచాయి. తొలి త్రైమాసిక పనితీరుకు ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌ను, రెండో త్రైమాసిక పనితీరుకు బిహార్ సర్కిల్‌ను పురస్కారాలతో సత్కరించారు.

**వినియోగదారుల సేవలకు ప్రాధాన్యం**
రికార్డు ఆదాయం సాధించిన అధికారులు, ఉద్యోగులను మంత్రి సింధియా అభినందించారు. కొత్త వినియోగదారులను ఆకర్షించడం, నాణ్యమైన సేవలు అందించడం, ఇప్పటికే ఉన్న వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ద్వారా వృద్ధిని కొనసాగించాలని సూచించారు. వ్యాపార విస్తరణ, ఆవిష్కరణలు, సేవల డిజిటలీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వర్తించే విధానాలు, అనుమతులకు లోబడి భారీ వినియోగదారులకు అనువైన ధరలను పరిశీలించాలని సూచించారు.

పార్సిల్ డెలివరీలో జాప్యాన్ని తగ్గించేందుకు ప్రామాణిక విధానాలు, రియల్‌టైమ్ పర్యవేక్షణ అవసరమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఉద్యోగుల సాధికారత, జవాబుదారీతనం, మెరుగైన సేవల ద్వారా తపాలా శాఖకు ఉన్న వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు.

పండుగలు, పార్సిళ్ల రద్దీ సమయంలోనూ వృద్ధిని కొనసాగించాలని మంత్రులు ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, అంతర్జాతీయ వ్యాపారం, సూక్ష్మ--చిన్న--మధ్యతరహా పరిశ్రమలు, ఒక జిల్లా--ఒక ఉత్పత్తి, పర్యాటకం, ఆర్థిక సమ్మిళితం, బీమా, గ్రామీణ రవాణా సేవలపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పౌర సేవలను విస్తరించడంతోపాటు వ్యయ నియంత్రణ పాటించాలని స్పష్టం చేశారు.

# మాల్దీవులకు భారత నౌకాదళ శిక్షణ నౌకలు

**సముద్ర భద్రత సహకారం బలోపేతమే లక్ష్యం**

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 22:**



భారత నౌకాదళానికి చెందిన మొదటి శిక్షణ స్క్వాడ్రన్ నౌకలు మాల్దీవులకు చేరుకున్నాయి. సుదూర శిక్షణ మోహరింపులో భాగంగా ఐఎన్ఎస్ తీర్, ఐఎన్ఎస్ సుజాతతోపాటు భారత తీరరక్షక దళ నౌక సారథి అక్టోబర్ 21న మాలే తీరానికి చేరుకున్నాయి. మాల్దీవుల జాతీయ రక్షణ దళం (ఎంఎన్‌డీఎఫ్) వీటికి ఘనస్వాగతం పలికింది. పర్యటనలో భాగంగా మొదటి శిక్షణ స్క్వాడ్రన్ సీనియర్ అధికారి మాల్దీవుల రక్షణ దళాధిపతి, తీరరక్షక దళ కమాండెంట్‌తో సమావేశమయ్యారు. భారత నౌకాదళం--ఎంఎన్‌డీఎఫ్ మధ్య నిరంతర సంప్రదింపులు, వివిధ రంగాల్లో సముద్ర సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. మాల్దీవుల్లో భారత హైకమిషనర్ జి. బాలసుబ్రమణియంను కూడా కలిశారు. శిక్షణ పరస్పర మార్పిడిలో భాగంగా భారత స్క్వాడ్రన్ శిక్షణార్థులు గిరిఫుషి శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఇరు దళాల మధ్య స్నేహ సంబంధాలు, పరస్పర అవగాహన పెంపొందించేందుకు ఒకరి నౌకలను మరొకరు సందర్శించడం, క్రీడా పోటీలు, సామాజిక పరస్పర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భద్రత, ప్రాంతీయ అభివృద్ధికి పరస్పర సమగ్ర సహకారాన్ని ప్రోత్సహించే 'మహాసాగర్' దృక్పథానికి అనుగుణంగా ఈ పర్యటన కొనసాగుతోంది. ఇరు దేశాల నౌకాదళాలు సమన్వయంతో పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించడంతోపాటు సముద్ర సంబంధాలను మరింత పటిష్ఠం చేయడానికి ఈ పర్యటన దోహదపడనుంది.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

శుక్రవారం అక్టోబర్ 23, 2026

www.trinetnews.com

# ప్రపంచ భాగస్వామ్యాలతో వ్యవసాయ ఉన్నత విద్యకు కొత్త దిశ

**పరిశ్రమలు--విద్యాసంస్థల అనుసంధానం బలోపేతం కావాలి: డాక్టర్ ఎం.ఎల్. జాట్**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:** వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత, జీవవైవిధ్య నష్టం వంటి ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేలా వ్యవసాయ ఉన్నత విద్యను పునర్‌రూపకల్పన చేయాలని వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగం (డేర్) కార్యదర్శి, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్ పిలుపునిచ్చారు. పోషకమైన, ఆరోగ్యకరమైన ఆహారానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చగల నిపుణులను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాలోని డెస్ మొయిన్స్‌లో వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న '2026 నార్మన్ ఇ. బోర్లాగ్ ఇంటర్నేషనల్ డైలాగ్' సందర్భంగా ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. భారత జాతీయ వ్యవసాయ శాస్త్రాల అకాడమీ (నాస్) అధ్యక్షుడి హోదాలో భారత వ్యవసాయ రంగ ప్రవాసులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యవసాయాన్ని కేవలం ఉత్పత్తికే పరిమితం చేయకుండా సమగ్ర వ్యవసాయ--ఆహార వ్యవస్థలు, విలువ గొలుసు దృక్పథంతో ముందుకు తీసుకెళ్లాలని జాట్ సూచించారు. మారుతున్న అవసరాలకు



అనుగుణంగా విద్య, పరిశోధనల్లో మార్పులు తీసుకురావాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో మానవ వనరులను తీర్చిదిద్దేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సహకారం మరింత బలోపేతం కావాలని పేర్కొన్నారు. రైతులకు తోడ్పాటుతో సహా వ్యవసాయ--ఆహార విలువ గొలుసు అంతటా పరిశ్రమల భాగస్వామ్యం పెరగాలన్నారు. వ్యవసాయ పరిశోధన, అభివృద్ధిలో కీలక సమస్యల పరిష్కారానికి విధానపరమైన చర్చలు, విధాన పత్రాలు ప్రాధాన్యం కలిగి ఉన్నాయని వివరించారు. పరిశోధకులు, విధాన నిర్ణేతలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఇతర భాగస్వాములు కలిసి ఉమ్మడి పరిష్కారాలను రూపొందించాలని కోరారు. విదేశాల్లోని భారత వ్యవసాయ నిపుణులను దేశీయ పరిశోధన, విద్యాసంస్థలతో అనుసంధానించడం ద్వారా అంతర్జాతీయ విజ్ఞాన మార్పిడికి అవకాశాలు విస్తరిస్తాయని జాట్ తెలిపారు. ప్రపంచ సంస్థలతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల భాగస్వామ్యాలు పరస్పర అభ్యసనానికి, శాస్త్రీయ పురోగతిని పంచుకోవడానికి దోహదపడుతున్నాయన్నారు. కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కాస్ట్)తో కుదిరిన అవగాహన ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ, వ్యవసాయ పరిశోధన, సామర్థ్యాభివృద్ధి, విజ్ఞాన మార్పిడిలో కొత్త అవకాశాలకు ఇది మార్గం సుగమం చేస్తుందని పేర్కొన్నారు. బలమైన అంతర్జాతీయ భాగస్వామ్యాలు ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల్లో వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణ సేవల పురోగతికి తోడ్పడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాస్ తరఫున అకాడమీ కార్యదర్శి డాక్టర్ బి.ఎస్. ద్వివేది, విదేశీ వ్యవహారాల కార్యదర్శి డాక్టర్ కరీమ్ మెరెడియా, పశ్చిమార్ధగోళ అంతర్జాతీయ విభాగం కన్వీనర్ డాక్టర్ పి.వి. వరప్రసాద్ ప్రాతినిధ్యం వహించారు.

# న్యూఢిల్లీలో నవంబర్ 13, 14న 'ఏపీఏసీ--23' సదస్సు

**15 ఏళ్ల తర్వాత భారత్‌లో ఆసియా--పసిఫిక్ ఆటోమోటివ్ ఇంజినీరింగ్ సమ్మేళనం**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:** ఆటోమొబైల్, రవాణా సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలపై చర్చించేందుకు న్యూఢిల్లీ వేదిక కానుంది. ఎస్‌ఏఈ ఇండియా ఆధ్వర్యంలో 23వ ఆసియా--పసిఫిక్ ఆటోమోటివ్ ఇంజినీరింగ్ కాన్ఫరెన్స్ 'ఏపీఏసీ--23' నవంబర్ 13, 14 తేదీల్లో యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. 15 ఏళ్ల విరామం తర్వాత ఎస్‌ఏఈ ఇండియా రెండోసారి ఈ సదస్సుకు ఆతిథ్యం ఇస్తోంది.
సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన, మేధో ఆధారిత రవాణా దిశగా వేగంగా ముందుకు సాగాలనే ఇతివృత్తంతో సదస్సు జరగనుంది. భారత్‌తోపాటు ఆసియా--పసిఫిక్ ప్రాంతానికి చెందిన పరిశ్రమల ప్రముఖులు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విధాన నిర్ణేతలు, విద్యావేత్తలు, అంకుర సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.




వెయ్యి మందికి పైగా ప్రతినిధులు, 500 మందికి పైగా మొబిలిటీ రంగ నిపుణులు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. రెండు రోజుల సదస్సులో 150కి పైగా సాంకేతిక ప్రజెంటేషన్లు, 80కి పైగా ప్రదర్శనదారుల భాగస్వామ్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయనున్నారు. వాహన తయారీ సంస్థలు, విడిభాగాల ఉత్పత్తిదారులు, సాంకేతిక కంపెనీలు, పరిశోధన సంస్థలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ--నియంత్రణ విభాగాల ప్రతినిధులు ఇందులో భాగస్వాములు కానున్నారు.
విద్యుత్ వాహనాలు, సాఫ్ట్‌వేర్, కృత్రిమ మేధస్సు, అనుసంధాన సాంకేతికత, ఆటోమేషన్, పర్యావరణ సుస్థిరత, మారుతున్న భద్రతా అవసరాలపై చర్చలు జరగనున్నాయి. ఈ పరిణామాలను సురక్షితమైన, సమర్థమైన రవాణా పరిష్కారాలుగా మార్చడంలో ఇంజినీరింగ్ ఆవిష్కరణల పాత్రను నిపుణులు పరిశీలించనున్నారు.
1981లో 'ఇంటర్నేషనల్ పసిఫిక్ కాన్ఫరెన్స్'గా ప్రారంభమైన ఈ వేదిక ప్రస్తుతం ఆసియా--పసిఫిక్ ప్రాంతంలోని 11 దేశాల ఆటోమోటివ్ ఇంజినీరింగ్ సమాజాల సహకార వేదికగా ఎదిగింది. సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, వ్యాపార సంబంధాల విస్తరణ, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి ఈ సదస్సు తోడ్పడనుంది.

# ఎల్‌నినో వచ్చినా.. విద్యుత్ కొరత రాకుండా పటిష్ట చర్యలు

**రోజువారీ విద్యుత్ ఉత్పత్తిని 140 మిలియన్ యూనిట్లకు పెంచాలి**
**యాదాద్రి ప్లాంట్‌లో రెండు యూనిట్లకు కోల్ ఇండియా నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా**
**మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం**
**విద్యుత్ బకాయిల పరిష్కారానికి వెసులుబాటు కల్పించేలా డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు**
**థర్మల్ విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:** ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రానున్న రబీ, వేసవి సీజన్లలో వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల అంశాలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, ఇటీవల ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైందని అధికారులు వివరించారు. ఈ స్థాయి నుంచి ఉత్పత్తిని మరింత పెంచి రోజుకు 140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యామ్నాయ



బొగ్గు సరఫరా అనుసంధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మార్గం ద్వారా బొగ్గు సరఫరా నవంబర్ నుంచి ప్రారంభం అవుతుందని వెల్లడించారు.
విద్యుత్ ఉత్పత్తి పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. "ఈ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్‌కు అనుసంధానించామని, మిగిలిన సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకువస్తున్నామని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. "టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజు వారీ సగటు ఉత్పత్తి 2024-25 సంవత్సరంలో 65.90 మిలియన్ యూనిట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 76.46 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 21 నాటికి 90.97 మిలియన్ యూనిట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రోజుకు 14.51 మిలియన్ యూనిట్ల మేర, సుమారు 19 శాతం పెరుగుదల నమోదైంది. అక్టోబర్ 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి" జరిగిందని అధికారులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని అన్ని యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌ను పెంచాలని, ఉత్పత్తిని రోజువారీ సమీక్షిస్తూ లక్ష్య సాధన దిశగా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని భట్టి విక్రమార్క ఆదేశించారు.
మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం
తెలంగాణ రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల చెల్లింపుల విషయంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా బకాయిల చెల్లింపును సులభతరం చేసి, వినియోగదారులకు ప్రయోజనం కలిగించేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మూతపడిన పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని, విద్యుత్ బకాయిల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అవకాశాలు, నిబంధనలపై అవగాహన కల్పించాలని ౧+ఉ్రాణజా, ౧+చీూణజా సీఎండీలను డిప్యూటీ సిఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా అర్హత కలిగిన పరిశ్రమలకు బకాయిల చెల్లింపుల్లో కొంతమేర వెసులుబాటు లభించడంతో పాటు, విద్యుత్ పంపిణీ సంస్థలకు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లకు అవకాశం కలుగుతుందన్నారు. అలాగే సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర సంస్థలకు వివిధ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఆర్పిడిసిఎల్ సీఎండీ ముషారఫ్, సింగరేణి డైరెక్టర్ గౌతం పోట్రు తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రజల సంక్షేమం కోసం అమిత్ షా నిరంతరం కృషి

**-రాష్ట్రీయ అమిత్ షా యువ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాథ్**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:** దేశ ప్రజల సంక్షేమం కోసం అమిత్ షా నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్రీయ అమిత్ షా యువ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాథ్ తెలిపారు. దేశ భద్రత కోసం నక్సలిజాన్ని నిర్మూలించడంలో
అమిత్ షా క్రియాశీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రీయ అమిత్ షా యువ సంఘటన్ హైద్రాబాద్ లో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాథ్ నేతృత్వంలో నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు
గురువారం హైదర్ గూడలోని
ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేక్ కట్ చేసి అమిత్ షాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




అనంతరం వివిధ బస్తీలలో పేద ప్రజలకు నిత్యావసర సరుకులు, విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు... ఆసుపత్రి ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ నాథ్ మాట్లాడుతూ, అమిత్ షా
అచంచలమైన నిబద్ధత, దృఢమైన, సకాలంలో నిర్ణయాలు,




యుద్ధ ప్రాతిపదికన తీసుకునే విధానం, భారతదేశాన్ని బలమైన, సురక్షితమైన దేశంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. దేశంలో శాంతిభద్రతలను కాపాడటానికి, సేవ చేయడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు చేస్తూ... రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు, విద్యార్థులకు అండగా నిలవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో సుమన్ సాయి వంశీ రాష్ట్రీయ అమిత్ షా యువ సంఘటన్ నాయకులు పాల్గొన్నారు.

# పద్మశాలి మీడియా మిత్రులకు ఘన సన్మానం

**రాజకీయాలకతీతంగా ఐక్యతే లక్ష్యం**

**సిరిసిల్ల, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:**



పద్మశాలి సమాజ అభ్యున్నతికి, ఐక్యతకు మీడియా మిత్రుల సేవలు ఎంతో విలువైనవని పట్టణ పద్మశాలి సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్లలోని సంఘం కార్యాలయంలో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన పత్రికా, మీడియా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా పద్మశాలీలందరినీ ఒకతాటిపైకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. పద్మశాలీలకు రాజ్యాధికారం సాధించే దిశగా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిజం రంగంలో తమదైన ముద్ర వేస్తూ, సమాజ గొంతుకగా నిలుస్తున్న మీడియా మిత్రులను గౌరవించుకోవడం గర్వకారణమన్నారు. కలం ద్వారా సమాజానికి సేవ చేస్తూ, కథనాల ద్వారా ప్రజలకు దిశానిర్దేశం చేస్తున్న జర్నలిస్టుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పద్మశాలి ఐక్యతే తమ బలమని, మీడియా మిత్రులను గౌరవించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సమాజ అభ్యున్నతే లక్ష్యంగా అందరూ కలిసి ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గుంటుక పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి మాదాస్ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి జిందం రవీందర్, కోశాధికారి దాసరి వెంకటేష్, కార్యవర్గ సభ్యులు గాజుల సదానందం, కుందేన సాయి శరత్, తాటిపాముల సత్యనారాయణ, దూడం సురేష్, మహేశుని అనిల్‌తో పాటు గజ్జెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జేపల్లి క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం...

**- వెల్జాల వెంకటేష్, గొడ్డేటి శేఖర్, కొర్రావత్ కవిత పవన్ నాయక్ ఆధ్వర్యంలో టోర్నమెంట్..**

**ట్రైనెట్ న్యూస్, నాగర్ కర్నూలు అక్టోబర్ 22 :**





దసరా పండుగను పురస్కరించుకుని చారకొండ మండల పరిధిలోని జేపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్ కు మాజీ వార్డు సభ్యులు వెల్జాల వెంకటేష్, దొడ్లపల్లి గోడేట్టి శేఖర్, జేపల్లి గ్రామ పంచాయతీ ఫార్మర్ అడ్వైజర్ కమిటీ సభ్యురాలు కొర్రావత్ కవిత పవన్ నాయక్ ఆధ్వర్యంలో రెండు రోజుల పా టు నిర్వహించిన క్రికెట్ టోర్న మెంట్ ఉత్సాహభరితంగా సాగింది. ఫైనల్ మ్యాచ్ లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో నెమలిగుట్ట తాండ అత్యు త్తమ ప్రతిభ కనబరిచిన జట్టు విజేతగా అవతరించింది. రన్నరప్ గా దొడ్లపల్లి జట్టు నిలిచింది. విజేత జట్టుకు మొదట బహుమతికి రూ.8వెలు జేపల్లి సీనియర్ మాజీ వార్డు సభ్యులు వెల్జాల వెంకటేష్ ఆర్థిక సహాయం చేయగా, రెండవ బహు మతికి 4వేలు దొడ్లపల్లి గొడ్డేటి శేఖర్ ఆర్థిక సహాయం చేశారు. అదేవిధంగా జేపల్లి గ్రామ పంచాయతీ ఫార్మర్ అడ్వై జర్ కమిటీ సభ్యురాలు కొర్రావత్ కవిత పవన్ నాయక్ విజేతల జట్టుకు ట్రోఫీల కు ఆర్థికంగా చేయూత అందించారు. పోటీలు ముగిసిన అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు సభలో కొర్రావత్ కవిత పవన్ నాయక్, గ్రామ సర్పంచ్ అమీనా అశోక్ రాథోడ్, వెల్జాల వెంకటేష్, దొడ్లప ల్లి శేఖర్, పలువురు ముఖ్య అతిథులు గా పాల్గొని విజేతలకు, రన్నరప్ జట్లకు నగదు బహుమతి, ట్రోఫీలను ప్రదానం చేశారు. పండుగ వేళల్లో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని పెంపొందించారు. క్రీడలు శారీ రక దృఢత్వానికే కాకుండా, మానసిక ఉల్లాసానికి, క్రీడాకారుల మధ్య ఐక్యతకు ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు. గె లు పోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటాలని యువతకు పి లుపునిచ్చారు. ఈ సందర్భంగా టోర్న మెంట్ కు ఆర్థిక సహాయం అందించి, టోర్నమెంట్ నిర్వహించిన వెల్జాల వెంక టేష్, గొడ్డేటి శేఖర్, కొర్రావత్ కవిత పవన్ నాయక్ లను గ్రామ యువత, క్రీడకారులు, పలువురు ప్రముఖుల చేతుల మీదుగా వారిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జేపల్లి గ్రామ పంచా యతీ యువత, క్రీడాభిమానులు, గ్రామ స్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకా రులను అభినందించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం సమష్టిగా కృషి చేయాలి - మంత్రి పొన్నం ప్రభాకర్

**నవంబర్ 6 లోపు అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22 :**
హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.
నాంపల్లిలోని రెడ్ రోజ్ గార్డెన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ పరిధిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీకి ఎంతో రాజకీయ ప్రాధాన్యత కలిగినవని తెలిపారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా భవిష్యత్తులో హైదరాబాద్ పరిధిలో జరిగే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకుల సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు తెలిపారు. అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు.
నవంబర్ 6వ తేదీలోపు అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పండుగలు ముగిసిన నేపథ్యంలో మరుసటి రోజు నుంచే పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల్లో బూత్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు తదితర అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించి, పీసీసీ నాయకులతో కలిసి రోజువారీగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా తాను, మంత్రి అజారుద్దీన్ తదితర నాయకులు క్షేత్రస్థాయి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వివిధ శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విజయాలను పట్టభద్రులకు వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని పార్టీకి మద్దతు కూడగట్టాలని నాయకులకు సూచించారు.
హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. రాబోయే నాలుగైదు రోజుల పాటు జూబ్లీహిల్స్‌తో పాటు ఇతర నియోజకవర్గాల్లో పార్టీ నాయకులతో కలిసి పర్యటించి, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎంపీ మల్లు రవి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీ గణేష్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, హైదరాబాద్ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, 15 అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, పీసీసీ కోఆర్డినేటర్లు, పార్టీ ఫ్రంటల్ ఆర్గనైజేషన్లు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెపై నిషేధాన్ని పొడిగించిన ప్రభుత్వం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:**
ఎల్?నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ వాటర్ వర్క్?లో ఉద్యోగుల సమ్మెపై విధించిన నిషేధాన్ని మరోసారి పొడిగించింది. మరో ఆరు నెలల పాటు సమ్మెపై నిషేధాన్ని విధించింది. గురువారం ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జీవో నంబర్ 955ను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ జారీ చేశారు. ఈ ఆదేశాలను అమలు చేయాలని హైదరాబాద్ వాటర్ బోర్డు ఎండీకి స్పష్టం చేశారు. అక్టోబర్ 21వ తేదీ నుంచి ఈ సమ్మెపై నిషేధం అమల్లోకి వచ్చిందని ఆ జీవోలో స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని వివరించారు. నీటి సరఫరా, పంపిణీ సేవల్లో సమ్మెలకు అనుమతి లేదని జారీ చేసిన జీవోలో వివరించారు.

# టీడీఆర్ సేవలకు ఆధార్‌తో గుర్తింపు నిర్ధారణకు ప్రభుత్వం అనుమతి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:**
టీడీఆర్ సేవలకు ఆధార్‌తో గుర్తింపు నిర్ధారణకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆస్తి యజమానులు, బిల్డర్లు, డెవలపర్లకు వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్, లాగిన్, దరఖాస్తుల ప్రక్రియలో ఆధార్ వినియోగించవచ్చని తెలిపింది. ప్రాపర్టీ డేటాబేస్‌తో ఆధార్ అనుసంధానానికి అవకాశం కల్పిచింది. డీటీసీపీ , జీహెచ్ఎంసీ అధికారులకు ఆన్‌లైన్ అథెంటికేషన్ సదుపాయం కల్పించింది. నకిలీ గుర్తింపులు, మోసాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని రాష్ట్ర సర్కార్ పేర్కొంది. ఆధార్ అథెంటికేషన్ స్వచ్ఛందమేనని.. తప్పనిసరి కాదని స్పష్టంచేసింది. ఈ మేరకు జీవో నంబర్ – 255ను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది.

# మల్లికార్జున నగర్ ట్రెజరర్‌గా ఉడుత శ్రీకాంత్ నామినేషన్

**- ఆశీర్వదించండి కాలనీ అభివృద్ధి చేసి చూపిస్తా : ఉడుత శ్రీకాంత్**

**ట్రైనెట్ న్యూస్, అంబర్ పేట అక్టోబర్ 22 :**



బాగ్ అంబర్ పేట మల్లికార్జుననగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా ట్రెజర ర్ పదవికి గురువారం ఉడుత శ్రీకాంత్ నామి నేషన్ దాఖలు చేశారు. స్థానికంగా మంచి గుర్తిం పు ఉన్న శ్రీకాంత్, కాలనీ అభివృద్ధి, పార దర్శకమైన ఆర్థిక నిర్వహణ తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. నామినేషన్ సంద ర్భంగా కాలనీ పెద్దలు, యువకులు ఆ యనకు మద్దతు తెలిపారు. ఈ సంద ర్భంగా ఉడుత శ్రీకాంత్ మాట్లాడుతూ.. "కాలనీ వాసులందరి సహకారంతో, నిధులను సద్వినియోగం చేస్తూ మల్లికా ర్జుననగర్ అభివృద్ధికి కృషి చేస్తాను అని అన్నారు. ఎన్నికల నిర్వహణ అధికారి బి.నాగేష్ గౌడ్ కు, ప్యానల్ సభ్యులకు ఆయన నా మినేషన్ ను అందజేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కిశోర్, పసర కొండ కిశోర్, కురెల్లి వెంకటేష్, వాస మహేష్, శివకు మార్, జి.రాజు యాదవ్, తేజతో పాటు సహచర బృందం సభ్యు లు, కాలనీవా సులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి అండగా నిలిచిన మానవతా మూర్తి - ఎమ్మెల్యే వేముల వీరేశం

**లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించి విద్యార్థి భవిష్యత్తుకు భరోసా నిచ్చిన నిజమైన నాయకుడు అంటే ప్రజల కష్టాల్లో అండగా నిలిచేవాడేనని నిరూపించారు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**



**ట్రైనెట్ న్యూస్, అక్టోబరు22/యాదాద్రి భువనగిరి:**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కుంకుడుపాముల గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి వరకాల సాయి సిద్ధార్థ గండిమైసమ్మ హితం కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూ ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్నాడని తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే స్పందించారు.విద్యార్థిని స్వయంగా తన నివాసానికి పిలిపించి, ఆప్యాయంగా పలకరించి, చదువుకు ఎలాంటి ఆటంకం రావొద్దంటూ రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయలు)ఆర్థిక సహాయాన్ని తన చేతుల మీదుగా అందజేశారు."బాగా చదువుకో బిడ్డా, ఉన్నత శిఖరాలకు ఎదగాలి, నీ భవిష్యత్తుకు నేను అండగా ఉంటా, ఏ అవసరం వచ్చినా నేరుగా నా దగ్గరకు రా"అంటూ విద్యార్థికి ధైర్యాన్ని, భరోసాను ఇచ్చారు.ఎమ్మెల్యే ఈ మహోన్నత సహాయానికి విద్యార్థి సాయి సిద్ధార్థ, అతని కుటుంబ సభ్యులు కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహాయంతో తన చదువు పూర్తవుతుందని ఆనందం వ్యక్తం చేశారు.ఒక విద్యార్థి జీవితంలో వెలుగులు నింపిన ఎమ్మెల్యే వేముల వీరేశంని నియోజకవర్గ ప్రజలు, యువత అభినందిస్తున్నారు. విద్యకు ప్రాధాన్యం ఇచ్చే వారి మంచి మనసుకు ఇది నిదర్శనం అంటూ కొనియాడుతున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నాతి పరశురాములు గౌడ్, మండల నాయకులు గడ్డం శ్రీనివాసులు, మెట్టగడుపుల రవి, గడ్డం కిషోర్, వరకాల అజయ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# దసరా వేళ కొడంగల్‌లో ఆత్మీయ సందడి..

**ప్రజలు, నాయకులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ**

**కొడంగల్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:**






విజయదశమి దసరా పండుగను పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొడంగల్‌లోని తన నివాసంలో నియోజకవర్గ ప్రజలు, స్థానిక నాయకులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో ప్రజలు, నాయకులు ముఖ్యమంత్రిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు, నాయకులతో కొద్దిసేపు ముచ్చటిస్తూ పండుగ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు. ముఖ్యమంత్రి తమ మధ్యే ఉండి ఆప్యాయంగా పలకరించడంతో ప్రజలు, నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. దసరా పండుగ నేపథ్యంలో ముఖ్యమంత్రి నివాసం ప్రజలు, నాయకుల రాకపోకలతో సందడిగా మారింది. పండుగ ఆనందాన్ని పంచుకుంటూ సాగిన ఈ ఆత్మీయ కలయికతో కొడంగల్‌లో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. ప్రజలు, నాయకులతో ముఖ్యమంత్రి గడిపిన ఈ ఆత్మీయ సమయం పండుగ వేళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఇంటర్ పరీక్షల టైం టేబుల్ విడుదల

**అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:**
రాష్ట్రంలో ఇంటర్ పరీక్షల విడుదలయింది . వచ్చే ఏడాది ఫిబ్రవరి 24వ తేదీ నుంచి మార్చి 16వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.
రెగ్యులర్, బ్యాక్ లాగ్ విద్యార్థులకు రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ షెడ్యూల్
ప్రకారం ఫిబ్రవరి 24 నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు, అలాగే ఫిబ్రవరి 25 నుంచి ద్వితీయ సంవత్సరం ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభమవుతాయని బోర్డు తెలిపింది. ప్రాక్టికల్ పరీక్షల విషయానికి వస్తే జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఒకేషనల్ కోర్స్ లకు విద్యార్థులకు మాత్రం ఫిబ్రవరి 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రెండు సెషన్లలో ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే రెండో సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదివారాల్లో కూడా కొనసాగనుందని ఇంటర్ బోర్డు కార్యదర్శి వి. రంజిత్ బాషా తెలిపారు. అయితే బోర్డు ప్రకటించిన ఈ టైం టేబుల్ తాత్కాలికం అని అధికారులు స్పష్టం చేశారు. ఏ రోజు ఏ సబ్జెక్టు పరీక్ష జరుగుతుందనే పూర్తి వివరాలతో కూడిన వివరణాత్మక టైమ్ టేబుల్ పిడిఎఫ్ రూపంలో విద్యార్థులకు, కళాశాలలకు అందుబాటులో ఉంచబడింది. విద్యార్థులు అధికారిక వెబ్సైట్ ద్వారా పరీక్షల సవివరమైన షెడూల్ను పరిశీలించి తమ సన్నాహాలను వేగవంతం చేసుకోవాలని సూచించారు.

# రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారింది

ఎంపీ అరవింద్



**నిజామాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:**
తెలంగాణలో రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ప్రకటించిన తర్వాతే క్రాప్ హాలిడే గురించి నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.
నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఎంపీ ధర్మపురి అరవింద్ పలు విమర్శలు చేశారు. సాగునీటి ప్రాజెక్టుల డిజైన్ల మార్పుల వెనుక భారీ అవినీతి ఉందని ఆయన ఆరోపించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భవిష్యత్తులో కలవడం ఖాయమని అరవింద్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ గడ్డం పెంచుకున్నంత మాత్రాన ముఖ్యమంత్రి కాలేరని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉందని వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా 2029 ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను రాజకీయంగా గల్లంతు చేస్తామని ధర్మపురి అరవింద్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ సునామీ సృష్టిస్తుందని అన్నారు. ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. ముఖ్యంగా పసుపు రైతులకు క్వింటాల్‌కు రూ.50 వేల ధర లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందుకు సంబంధించిన కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు. అవసరమైతే ఈ హామీపై బాండ్ పేపర్ రాసి ఇస్తానని అన్నారు.

# ఆయుష్ శాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**



ఆయుష్ శాఖ పరిధిలో పొరుగు సేవల పద్ధతిన వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 4 మెడికల్ ఆఫీసర్, 1 ఫార్మసిస్ట్, 1 సైకోసోషల్ కౌన్సిలర్ (సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు), 1 యోగ ప్రొఫెషనల్, 3 మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం/ సంస్థ నుంచి ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, నేచురోపతిలో సంబంధిత విద్యార్హతతో పాటు తప్పనిసరి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని, ఫార్మసిస్ట్ పోస్టుకు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఫార్మా–డి అర్హతతో పాటు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో నమోదు అయి ఉండాలని, సైకోసోషల్ కౌన్సిలర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని, యోగ ప్రొఫెషనల్ పోస్టుకు సంబంధిత విభాగంలో నిర్దేశిత విద్యార్హతతో పాటు నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో డిప్లొమా అర్హత ఉండాలని, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, సైకిల్ / మోటార్ సైకిల్ నడపగలగాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం వర్తించే సందర్భంలో, ఇతర అవసరమైన పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. అర్హత పరీక్షలో మార్కులు, వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, మెరిట్ లిస్ట్ https://www.mancherial.telangana.gov.in వెబ్ సైట్ లో ఉంచడం జరుగుతుందని తెలిపారు. మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28వ తేదీన సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే ముందు అధికారిక నోటిఫికేషన్‌లోని పూర్తి నిబంధనలు, అర్హతలు, రిజర్వేషన్లు, ఎంపిక విధానాన్ని పరిశీలించాలని తెలిపారు.

# యువతను రెచ్చగొట్టే విధంగా వాక్యాలు చేయడం సరికాదు

**• మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ హితువు**




సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని ధర్మసాగర్ పల్లె గ్రామంలో దసరా పండుగ సందర్భంగా గ్రామంలో బి ఆర్ ఎస్ నాయకులు మహిషాసురుని రూపంలో ముఖ్యమంత్రి,రాష్ట్ర మంత్రి వర్యుల ఫోటోలు పెట్టి దహనం చేసి, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టిన యువకులను ప్రోత్సహించే విధంగా మాట్లాడిన సతీష్ కుమార్ వెంటనే క్షమాపణలు చెప్పాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఈ మేరకు ఆయన కార్యకర్తలతో కలిసి ఈ విధంగా డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్, సర్పంచ్ ల ఫోరమ్ కన్వీనర్ కరివేద చంద్రారెడ్డి,మంద ధర్మయ్య, దొమ్మాట జగన్ రెడ్డి తదితరులతో కలసి కలిసి మాట్లాడుతూ, ఇక్కడ జరిగిన వాస్తవాలను తెలుసుకోకుండా సతీష్ కుమార్ మాట్లాడటం ఇటురంగా ఉందన్నారు. సంఘటనలో ప్రమేయం ఉన్నవారీ పై మాత్రమే ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో చెల్లని రూపాయి ఎవ్వరో నియోజకవర్గ ప్రజలు మొన్నటి శాసనసభ ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న తెలంగాణ ఉద్యమ నాయకులు రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. తమ పార్టీలో కూడా యూత్ కాంగ్రెస్, ఎస్ యు ఐ విభాగం ఉందని, రెచ్చగొట్టే విధంగా ప్రేరేపించే స్వభావం తమకు లేదని అన్నారు . హుస్నాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి నీ చూసి తట్టుకోలేక మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. సతీష్ బాబు గతంలో పెంచే పెల్లి గ్రామంలో ఇద్దరి పై అక్రమ కేసులు బనాయించి రాక్షస ఆనందం పొద్దున సంఘటనలు వారు గుర్తు చేశారు.మీరు మా నాయకుని గురించి మాట్లాడటం మీ అవివేకం.ఇక్కడ జరిగిన వాస్తవాలు తెలుసుకోకుండా మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు మాట్లాడిన వాక్యాలను రేపటిలోగా వెనక్కు తీసుకొని యువతకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బందెల సుజాత బాలకిషన్,వేల్పుల వెంకటస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్ గౌడ్,ఎస్సీ సెల్ నాయకులు చింతకింది శంకర్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివారెడ్డి, ఎన్ ఎస్ యు ఐఅధ్యక్షుడు సనత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆవుల మహేందర్, గుండారెడ్డి పల్లె గ్రామ శాఖ అధ్యక్షులు జప రాజిరెడ్డి మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు మంద వంశీ తదితరులు పాల్గొన్నారు

# భూ భారతి, రీ-సర్వే, ఓటరు జాబితా సవరణ పనులను వేగవంతం చేయాలి,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**



భూ భారతి, రీ–సర్వే, ఓటరు జాబితా సవరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ సంతోష్ కుమార్‌తో కలిసి ఉద్యోగులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని, కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. సాదా బైనామా, భూ భారతి దరఖాస్తుల పరిశీలన, రీ–సర్వే ప్రక్రియ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పనుల పురోగతిపై సమీక్షించారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.హాజీపూర్ మండల పరిధిలోని వేంపల్లి గ్రామంలో మండల తహసిల్దార్ పుష్పలతతో కలిసి భూ భారతి, రీ–సర్వే, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మండలంలోని గుడిపేట గ్రామ రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన వ్యవసాయ మార్కెటింగ్, పత్తి మార్కెటింగ్, మద్దతు ధరలపై అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు, పత్తి విక్రయాలు, మద్దతు ధరలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర మంత్రి పలు సూచనలు చేశారు. రైతులకు ప్రభుత్వ మార్గదర్శకాలు, మార్కెటింగ్ సంబంధిత సమాచారాన్ని చేరవేయాలని అధికారులకు సూచించారు.అనంతరం నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, భూసారాన్ని పునరుద్ధరించడం, రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక



వినియోగాన్ని తగ్గించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని శాస్త్రీయ పద్ధతులలో నియంత్రిస్తూ, ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను క్రమంగా అవలంబించేలా ప్రోత్సహించాలని సూచించారు. సాగు ఖర్చులను తగ్గించి, రైతులకు మెరుగైన ఆదాయం వచ్చేలా కృషి చేయవచ్చని తెలిపారు. పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం, భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా ఎరువులను వినియోగించడం, పంట వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం వంటి పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నేల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు అందించాలని, స్థిరమైన వ్యవసాయ పద్ధతుల అమలుకు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**•ముదిరాజ్ సంఘం.బీసీ సంఘాల ఆధ్వర్యంలో**



కల్వకుర్తి తాలూకా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పండుగ సాయన్న జయంతి తేదీ 22/10/2026 అలాగే 10/12/2026 వర్ధంతి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాబిన్ హుడ్ పండుగ సాయన్న 174వ జయంతి కల్వకుర్తి తాలుక ముదిరాజ్ సంఘం.బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్.మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడు. బీసీ సబ్ ప్లాన్ తాలూకా అధ్యక్షులు రాజేందర్ డి ఎఫ్ సి ఎస్ జిల్లా డైరెక్టర్ మరియు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌడుగు బాల్ చందర్ ముదిరాజ్.ముదిరాజ్ సంగం తాలూకా నాయకులు నాయకులు పుట్ట శేఖర్.ఎముక జంగయ్య.కొల్లూరు శ్రీధర్.అనంత శేఖర్.పుస్తకాల రాహుల్.పుట్ట వెంకటయ్య.కుంభం భీమయ్య.గుడి శ్రీనివాసులు.కుంభం సురేష్.వనం వీరస్వామి.కృష్ణ గౌడ్.తాళ్ల పండు గౌడు.ఎండి



రుక్మొదిన్.యంగంపల్లి రామస్వామి.గాదముని సురేందర్ గౌడ్.శేఖర్ ముదిరాజ్.యాదయ్య ముదిరాజ్.జిల్లెల్ల జంగయ్య ముదిరాజ్.రాము ముదిరాజ్.మొగులాన్ ముదిరాజ్.తల సురేష్ గౌడ్.భాస్కర్ గౌడ్.బచ్చలకూర శ్రీశైలం.టైలర్ సురేష్ గౌడ్.పీట్ల చెన్నయ్య.శ్రీకాంత్ ముదిరాజ్.వెంకటేష్ ముదిరాజ్.శ్రీకాంత్ ముదిరాజ్.కుమ్మ గోని పాండు గౌడ్.గారెల సత్యం ముదిరాజ్. మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



సిద్ధిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్

ఆధ్వర్యంలో పండుగ సాయన్న ముదిరాజ్ 174 వ జయంతి సందర్భం గా అంబేద్కర్ ముఖ్య కూడలి వద్ద మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముదిరాజ్ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. శెట్టి సుధాకర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొట్ట మొదటి సారిగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతినీ అధికారికంగా నిర్వహించినందుకు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ , బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా జీవనమే జీవితంగా, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరుపేద వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని కొనియాడారు, మహిళల ఆత్మగౌరవం కోసం తిరుగుబాటు చేసిన ధైర్య శీలి,బహుజన బిడ్డ అని కీర్తించారు.ప్రజల గుండెల్లో తెలంగాణ రాబిన్ హుడ్ గా నిలిచిన ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ నిలిచిపోయారన్నారు.గత ప్రభుత్వం పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి,వర్ధంతినీ అధికారికంగా నిర్వహించకపోవడమే కాకుండా వారి జీవిత చరిత్రను వక్రీకరించారన్నారు.బలహీన వర్గాల ప్రజల కోసం పోరాటం చేసిన మహనీయులను ఈ ప్రజా పాలన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారి ఆశయాలకు అనుగుణంగానే పని చేస్తుందని అనడానికి ఈ మహనీయుని జయంతిని అధికారికంగా నిరహించడం ద్వారా మనం తెలుసుకోవచ్చు అని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పండుగ సాయన్న ముదిరాజ్ గారి జయంతినీ మొదటిసారిగా అధికారికంగా నిర్వహిస్తున్నందుకు గాను ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసిన ముదిరాజ్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ మరి రానున్న రోజుల్లో కూడా మా కాంగ్రెస్ పార్టీని బలపరచి ప్రజా పాలన ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తారని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ మరియు డైరెక్టర్లు,మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ లు,మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు,ఎస్ యు ఐనాయకులు మరియు ముదిరాజ్ సభ్యులు,నాయకులు, మహిళ కాంగ్రెస్ పార్టీ నాయకులు

# నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పండుగ సాయన్న,





**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,**

పెత్తందారులు, భూస్వాములు, జమీందారీ వ్యవస్థతో పాటు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న జయంతి వేడుకలకు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మాట్లాడుతూ తెలంగాణ ప్రజల అణచివేతను ఎదిరించి పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని తెలిపారు. తెలంగాణ ప్రజావీరుడుగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. సమాజంలోని పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి కృషి చేశారని, ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయమని తెలిపారు. సమాజంలోని పేద ప్రజల సంక్షేమానికి తోడ్పడిన ఇలాంటి మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమానత్వం, సేవాభావం, పేదల పట్ల మానవత్వం పెంపొందించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరాం, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా పరిషత్ సిఈఓ గణపతి, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది,

# భూ రీ-సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేయాలి,

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**



భూ రీ–సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం చాకపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ–సర్వే పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ భూ రికార్డుల ప్రక్షాళన, సర్వే ప్రక్రియ అమలు, సర్వే పనులలో పారదర్శకత, ఖచ్చితత్వం తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, భూ రీ–సర్వే ప్రక్రియను సమర్థవంతంగా, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మనోజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, తాండూర్ మండల తహసిల్దార్ జ్యోత్స్న లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి తాండూర్ మండల పరిధిలో చేపట్టిన భూ రీ–సర్వే పనుల పురోగతి, భూభారతి పథకం క్రింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై సమగ్రంగా సమీక్షించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. రైతులు,



ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు భూ రికార్డులకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిష్కరించాలని తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా భూ రీ–సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు, ప్రజలకు సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం అక్టోబర్ 23, 2026
www.trinetnews.com

# రెండవ రోజు కొనసాగిన ఎంపిటిసి అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ





మొగల్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపీటీసీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు గురువారం సాయంత్రం నాటికి 67 మంది అభ్యర్థులు తమ దరఖాస్తులు చేసుకున్నట్లు మొగల్తూరు మండలం ఎన్నికల అధికారి జి స్వాతి అన్నారు. వానిలో బుధ, గురువారం రెండు రోజుల నాటికి మొత్తం 67 మంది దరఖాస్తు చేసుకోగా వానిలో తెలుగుదేశం పార్టీ నుండి 18 మంది జనసేన పార్టీ నుండి 19 మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి 28 మంది అభ్యర్థులు, ఇండిపెండెంట్ 02 మంది అభ్యర్థులు తమ దరఖాస్తులు చేసుకున్న వారిలో ఉన్నారని ఆమె తెలిపారు. శుక్రవారం కూడా ఎంపీటీసీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ వేసుకునే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో మొగల్తూరు మండలం రిటర్నింగ్ అసిస్టెంట్ ఎన్నికల అధికారులు సిహెచ్ త్రిశూలపాణి, అబ్దుల్ ఫరూక్, మరియు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెంట్ ఎన్ఎస్వెచ్ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవోలు నవీన్ కిరణ్, నూకల వెంకట సూర్యనారాయణ, పి ఆర్ ఏ ఈ అరటి కట్ల వెంకటేశ్వరరావు, మరియు గ్రామ సచివాలయ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. నామినేషన్లు వేసే ఎంపీడీవో కార్యాలయ పరిధిలో నరసాపురం సిఐ జి నాగరాజు పర్యవేక్షణలో మొగల్తూరు సబ్ ఇన్స్పెక్టర్ జి వాసు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎంపీటీసీ పోటీ చేసే అభ్యర్థులు తో పాటు మరో ఇద్దరు వ్యక్తులను మాత్రమే కార్యాలయంలో పలికి పోలీసులు అనుమతించారు. ఉదయం మందకోడిగా ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ మధ్యాహ్నం రెండు గంటల దాటిన అనంతరం నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కార్యాలయ ప్రాంగణమంతా అభ్యర్థులు అనుచరులతో కిటకిటలాడింది.

# తర్నికల్ గ్రామంలో ఘనంగా ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి



కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామంలో ముదిరాజ్ సంఘం నాయకులు యువకుల ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దొరల దోపిడీకి, పెత్తందారుల అన్యాయాలకు ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి పండుగ సాయన్న జయంతి సందర్భంగా ఆ పోరాట యోధునికి ఘనంగా నివాళులర్పించారు. అణగారిన ప్రజల కన్నీళ్లు తుడుస్తూ, ఆకలితో అలమటించే పేదలకు అండగా నిలిచి,ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్న ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి ఘనంగా జరుపుకొని భారీ ఎత్తున ర్యాలీతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంగం యువకులు. మహిళలు. బిజీ సంఘం నాయకులు. వివిధ కుల సంఘాలు పాల్గొన్నాయి.

# రాజంపేట డివిజన్లో ప్రశాంతంగా రెండో రోజు నామినేషన్లు -డి ఎస్ పి వెంకటరామయ్య



రాజంపేట డివిజన్లోని నందలూరు మినహా ఆరు మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రెండో రోజు ఎంపీటీసీ నామినేషన్లు ప్రశాంతంగా జరిగాయని రాజంపేట డిఎస్ పి వెంకటరామయ్య తెలిపారు. గురువారం ఒంటిమిట్ట ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియను డిఎస్పి పరిశీలించారు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఒంటిమిట్టలో రాజంపేట టౌన్ సిఐ హేమ సుందర్ రావు ఒంటిమిట్ట ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ కేంద్రం వద్ద పాత 144 సెక్షన్ ప్రకారం నలుగురు మించి గుమ్మి కూడదని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన పటిష్టమైన పందోబస్తును ఏర్పాటు చేశామన్నారు ప్రజాస్వామ్య పద్ధంగా స్వేచ్ఛగా ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్ వేసుకోవచ్చు అన్నారు. ఎవరైనా ఎంపీటీసీ అభ్యర్థులను బెదిరించిన చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . నందలూరులో ఒకే పార్టీకి చెందిన వ్యక్తులు ఘర్షణకు పాల్పడ్డారని అది కూడా నామినేషన్ కేంద్రం కు దూరంగా ఘర్షణకు పాల్పడ్డారన్నారు నందలూరు మినహా రాజంపేట డివిజన్లో ప్రశాంతంగా రెండో రోజు నామినేషన్ల పర్వం పూర్తయింది అన్నారు

# ప్రమాద బాధిత కుటుంబానికి గోలి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం



కల్వకుర్తి: నియోజకవర్గంలోని వేపూర్ గ్రామానికి చెందిన శంకర్ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా కల్వకుర్తి పట్టణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయం వేపూర్ గ్రామానికి చెందిన కల్వకుర్తి మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ ద్వారా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీ గోలి శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించారు.
హైదరాబాద్ లోని జీవన్ హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న శంకర్‌ను, ఆయన కుమార్తె భూమికను, కుమారుడిని పరామర్శించారు. ప్రమాదం కారణంగా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి రూ. 8,000 ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు.
ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లు గోవర్ధన్ సేట్, అనిల్ కుమార్(హైజాక్ ),అదేవిధంగా గోపి తదితరులు పాల్గొన్నారు.

# భీమవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం



మాచర్ల పట్టణంలో గురువారం టీడీపీ నాయకులు భీమవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటి కి వెళ్లి తమ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

# మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పై కేసు నమోదు



పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తోపాటు ఆయన అనుచరులపై మాచర్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మాచర్ల పట్టణంలో 144 సెక్షన్ మరియు పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్నప్పటికీ, వాటిని ఉల్లంఘిస్తూ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన మద్దతుదారులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన (రాస్తారోకో) నిర్వహించారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఈ నిరసన చేపట్టడం వల్ల ప్రజలకు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిందని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా, విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారుల పనితీరుకు అడ్డుతగిలారనే ఆరోపణల నేపథ్యంలో మాచర్ల పట్టణ పోలీసులు పిన్నెల్లి మరియు ఆయన అనుచరులు 30 మందిపైన మరో కొంతమందిపై కేసులు నమోదు చేసి, తదుపరి విచారణను ప్రారంభించారు.

# డంపింగ్ యార్డు మరణాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలి-- షేక్ షావలి డిమాండ్

**-సలీం మృతిపై విచారణ జరిపించి, కుటుంబానికి నష్టపరిహారం అందించాలని డిమాండ్**



జవహర్ నగర్ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన, విషవాయువుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వరుస మరణాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, జేఏసీ కన్వీనర్లు మహ్మద్ జావేద్, శారద డిమాండ్ చేశారు. గబ్బిలాలపేటకు చెందిన మహ్మద్ సలీం (40) అక్టోబర్ 20న ఊపిరి ఆడక మృతి చెందడంపై వారు సంతాపం వ్యక్తం చేశారు.
సలీం మృతికి గల కారణాలను నిర్ధారించేందుకు వైద్య పరీక్షలు నిర్వహించి, గాలి, నీరు, భూమి నాణ్యతపై విచారణ చేపట్టాలని కోరారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, రాంకీ డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించి, జవహర్ నగర్‌కు చెత్త తరలింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

# మొగల్తూరు ఎంపీటీసీ 5వ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా చిట్టిబాబు నామినేషన్



మొగల్తూరు ఎంపీటీసీ 5వ స్థానం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ముదునూరి ప్రసాద్ రాజు బలపరిచిన అభ్యర్థిగా వి చిట్టిబాబు నామినేషన్ దాఖలు చేశారు. గురువారం మొగల్తూరు ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత ఎన్నికల అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో మండలంలో ఎన్నికల సందడి నెలకొంది. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ అభ్యర్థిత్వాలను అధికారికంగా నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో మొగల్తూరు మండలం నుంచి అత్యధికంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి నమోదు కావడం విశేషం

# కైకలూరు నియోజకవర్గం లో జడ్పిటిసి నామినేషన్ల సందడి

•కూటమి నేతలతో కలిసి ఏలూరుకు భారీ ర్యాలీగా తరలి వెళ్లిన ఎమ్మెల్యే కామినేని





కైకలూరు నియోజకవర్గం లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది జడ్పిటిసి అభ్యర్థుల నామినేషన్ల నేపథ్యంలో కూటమి నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా ముందుకు సాగారు ఈ క్రమంలో కైకలూరు నియోజకవర్గం లోని నాలుగు మండలాల జడ్పిటిసి అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమానికి హాజరయ్యేందుకు గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ కూటమి నేతలతో కలిసి ఏలూరుకు భారీ ర్యాలీగా తరలి వెళ్లారు.. కైకలూరు సి.ఎన్.ఆర్. గార్డెన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.. ఈ నామినేషన్ ర్యాలీలో శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ , మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు నియోజకవర్గ టిడిపి కన్వినర్ కొత్తా నాగేంద్ర కుమార్ ప్రజాప్రతినిధులు, ఎన్నికల నిర్వహణ సమన్వయ కర్తలు మొదలగు నేతలు పాల్గొన్నారు.

# కుక్కునూరు జడ్పీటీసీగా బొంతు కోమలాదేవి నామినేషన్

ఏలూరు జిల్లా కుక్కునూరు మండల జడ్పీటీసీ అభ్యర్థిగా బీజేపీ, జనసేన పార్టీల మద్దతుతో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న బొంతు కోమలాదేవి ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.
కూటమి ఐక్యతే బలం.. అభివృద్ధే లక్ష్యం
తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఐక్యతతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు సాగుతోంది. ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రజల విశ్వాసాన్ని పొందే దిశగా కృషి చేస్తోంది.
కుక్కునూరు మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బొంతు కోమలాదేవి ఎన్నికల బరిలో నిలిచారు. కూటమి నాయకులు, కార్యకర్తల సమన్వయం, ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తామనే ధీమాను పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.
కుక్కునూరు మండల అభివృద్ధికి కూటమి అభ్యర్థి బొంతు కోమలాదేవికి ప్రజల మద్దతు కోరుతూ పార్టీ శ్రేణులు ఎన్నికల కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి.
------------------------------------------------

# వైకాపా ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు





ద్వారకాతిరుమలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. ఎంపీటీసీ- 1స్థానానికి ఉక్కుర్తి వెంకటరావు, చిలుకూరి చంద్రశేఖరరావు ఎంపీటీసీ- 2 స్థానానికి పొంగులేటి రమేష్, పొంగులేటి రాణి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ద్వారకాతిరుమల మండల వైఎస్ఆర్సిపి నాయకుల ఆధ్వర్యంలో మండల రిటర్నింగ్ అధికారి నిర్మల జ్యోతికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా గ్రామ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, రుద్ర వెంకట శివాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, పొనమాల ఉమామహేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏదో ఒక విషయంలో ట్రోల్ చేస్తూనే ఉన్నారు: రష్మిక



ఇండస్ట్రీకి వచ్చిన నాటి నుంచి ఏదో ఒక విషయంలో తనను ట్రోల్ చేస్తూనే ఉన్నారని నటి రష్మిక తెలిపారు. హిందీ సినిమాల్లో దక్షిణాది యాసతో మాట్లాడుతున్నారంటూ తనపై వస్తోన్న ట్రోలింగ్‌పై ఆమె తాజాగా స్పందించారు. తన సహజమైన యాసను తప్పుగా చూడటంలో అర్థం లేదన్నారు. విజయ్ దేవరకొండతో కలిసి 'కాఫీ విత్ కరణ్' టాక్ షోలో పాల్గొన్న ఆమె.. సినిమాల్లో నటన, భాష, డైలాగులు చెప్పే విధానం.. ఇలా తన కెరీర్ ప్రారంభం నుంచి ఏదో ఒక విషయంలో విమర్శలు ఎదుర్కొంటూనే ఉన్నానని చెప్పారు. అయితే, వాటి కారణంగా తనకు తాను హద్దులు విధించుకోవాలని ఎప్పుడూ అనుకోలేదన్నారు."నేను దక్షిణాది యాస పలుకుతున్నట్లు కొందరు అంటున్నారు. నేను అక్కడి నుంచే వచ్చాను. కాబట్టి నాకు ఆ యాస ఉంటుంది. అలా కాకుండా మరోలా ఉండాలని అనుకోవడం సమంజసం కాదు. నేను సినీ పరిశ్రమలోకి వచ్చినప్పటి నుంచి ఇలాంటి విమర్శలు, ట్రోలింగ్ ఎదుర్కొంటూనే ఉన్నాను. నా నటన, భాష, యాస.. ఇలా దేనినీ వదలడం లేదు. కానీ, నేను మాత్రం వీటి కారణంగా నా అవకాశాలకు అడ్డుకట్ట వేసుకోవాలనుకోలేదు. ఒక్క భాషకే పరిమితం కావాలని అనుకోలేదు" అని రష్మిక వివరించారు.వేర్వేరు భాషల్లో సినిమాలు చేస్తున్నప్పుడు డబ్బింగ్ విషయంలోనూ తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని రష్మిక తెలిపారు. తన పాత్రకు మరో డబ్బింగ్ ఆర్టిస్టు గొంతు బాగుంటుందని దర్శకులు భావిస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పినట్లు వెల్లడించారు. అయితే, ఇప్పటివరకు తన దర్శకులంతా తనతోనే డబ్బింగ్ చెప్పించేందుకు ఆసక్తి చూపారని పేర్కొన్నారు. "వాళ్లు నాతోనే డబ్బింగ్ చెప్పించాలనుకున్నారు. ఇది నాకు గొప్పగా అనిపించింది. ఎందుకంటే, ఇన్ని భాషల్లో డబ్బింగ్ చెప్పడం చాలా కష్టమైన పని. దానిని నేను చేయగలిగితే అంతకంటే సంతోషం మరొకటి ఉండదు" అని రష్మిక తెలిపారు.



# దసరాపై వ్యాఖ్యలు.. రణ్‌బీర్ కపూర్ క్షమాపణలు

బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ దసరా వేడుకల్లో చేసిన వ్యాఖ్యలపై వివాదం నెలకొంది. చెడుపై మంచి విజయం సాధిస్తుందనే సందేశాన్ని చెప్పే క్రమంలో ఆయన నోరు జారడంతో సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా దీనిపై స్పందించిన రణ్‌బీర్.. క్షమాపణలు తెలిపారు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకోవద్దని, అనుకోకుండా జరిగిన పొరపాటు మాత్రమేనని వివరణ ఇచ్చారు.'రామాయణ' సినిమా ప్రచారంలో భాగంగా అక్టోబర్ 20న కోల్‌కతాలో నిర్వహించిన దసరా వేడుకల్లో రణ్‌బీర్ కపూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దసరా పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ.. చెడుపై మంచి సాధించే విజయాన్ని ప్రస్తావించారు. అయితే, తన ప్రసంగంలో ఆయన పొరపాటున మంచి, నిజాయతీ అంతమవుతాయని అర్థం వచ్చేలా మాట్లాడారు. తాజాగా దీనిపై ఆయన వివరణ ఇస్తూ.. "ఉద్దేశపూర్వకంగా నేను అలా మాట్లాడలేదు. అది ఓ పొరపాటు. నేను చెప్పాలనుకున్నది వేరు. 'చెడు ఎంత శక్తిమంతమైనదైనా చివరకు మంచే విజయం సాధిస్తుంది' అని చెప్పాలనుకున్నాను" అని తెలిపారు.

# మనిషే దేవుడిలా....?



తన ప్రయోగం విజయవంతమైతే మనిషే దేవుడిలా తయారవుతాడంటూ ల్యాబ్‌లోనే గడిపాడు ఆ శాస్త్రవేత్త. ఇంతకీ అతను తలపెట్టిన ఆ ప్రయోగం వెనక లక్ష్యం ఏమిటి? అది ఫలించిందా లేదా? తెలియాలంటే 'కిల్లర్' చూడాల్సిందే! జ్యోతి పూర్వజ్, పూర్వజ్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. మనీశ్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్‌రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి కీలక పాత్రలు పోషించారు. పూర్వజ్ దర్శకత్వం వహిస్తూ, ఎ.పద్మనాభరెడ్డితో కలిసి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. దర్శకుడు హరీశ్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రైలర్ విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ "న్యూరో లింక్ నేపథ్యంలో సాగే కథ ఇది. ఈమధ్య ఎలాన్ మస్క్ న్యూరో లింక్‌పై పరిశోధనలు చేయిస్తున్నారు. ఆ అంశానికీ, ఈ కథలో సూపర్ ఉమెన్‌తో ముడిపెడుతూ సినిమాని తీయడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. దర్శకుడు పడిన కష్టం తెరపై స్పష్టంగా కనిపిస్తోంది. ఎంతో నాణ్యంగా సినిమాని తీశారు. అనుకున్న బడ్జెట్‌లో ఇలాంటి సినిమాని తీయడం గొప్ప విషయం. బృందం అంతటికీ గొప్ప ఫలితం చేకూరాలని కోరుకుంటున్నా" అన్నారు. "మూడు పార్శ్వాలున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించా. జ్యోతి పూర్వజ్ చేసిన పాత్ర ప్రత్యేకమైన అనుభూతికి గురిచేస్తుంది. ఆ నేపథ్యంలో వచ్చే మలుపుని ఎవ్వరూ ఊహించలేరు. విరామం తర్వాత ఐదు నిమిషాల్లోపు ఆ మలుపుని సరిగ్గా ఊహిస్తే రూ.కోటి బహుమతి అందిస్తాం. అందుకోసం మేం ఓ వాట్సప్ నెంబర్‌ని ఇస్తాం. కచ్చితంగా ఇదొక కొత్త ప్రయత్నం. ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచుతుంది" అన్నారు దర్శకుడు, నిర్మాత పూర్వజ్. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

# రెండు మహాశక్తులు ఢీ



ఒంటరిగా నిద్రపోవడానికి కూడా భయపడే ఓ పోలీసు అధికారిణి... చిన్న పిల్లలు, అమాయక ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లినప్పుడు దైవశక్తి అండతో అమ్మవారిగా ఎలాంటి అవతారమెత్తింది? దుష్టశక్తులతో ఆమె చేసిన పోరాటమేంటో తెలియాలంటే 'మహాశక్తి' చిత్రం చూడాల్సిందే. అగ్ర కథానాయిక నయనతార ముఖ్యపాత్ర పోషిస్తున్న ఈ సినిమా దీపావళి కానుకగా నవంబరు 6న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. డివోషనల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నారు. ఈషారీ కే గణేశ్ నిర్మాత. తాజాగా చిత్రబృందం 'వరల్డ్ ఆఫ్ మహాశక్తి' పేరిట చిత్ర నేపథ్యాన్ని తెలియజేస్తూ సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియోను విడుదల చేసింది. 'ఇంకొక మూడు రోజుల్లో రెండు మహా శక్తులు ఢీ కొనబోతున్నాయి' అంటూ వివిధ శక్తుల పరిచయంతో ప్రారంభమైన ఈ వీడియో ప్రతినాయిక ఛాయలున్న పాత్రలో రెజీనా చెప్పిన 'ఆటని ఆరంభించినచోటే ముగించేద్దాం' అనే డైలాగు, నయనతార పోరాట సన్నివేశాలతో ఆకట్టుకుంది. హీరోయిన్ రెజీనా, ఊర్వశి, యోగిబాబు తదితరులు ఇందులో కీలకపాత్రలు పోషిస్తున్నారు.

# పంచప్రాణాలు అన్నయ్యే



శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'భోగి'. సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. 1960ల ప్రారంభంలో మహారాష్ట్ర - ఆదిలాబాద్ సరిహద్దు నేపథ్యంలో సాగే కథ ఇది. ఈ చిత్రంలోని 'అన్నయ్య పానంలో పూసిన పువ్వులు ఐదుగురు శెల్లెల్లంట...' అంటూ సాగే గీతాన్ని ఇటీవలే విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరకల్పనలోని ఈ గీతానికి ప్రముఖ రచయిత చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రీకృష్ణ ఆలపించారు. అన్న, ఆయనకు పంచ ప్రాణాలైన ఐదుగురు చెల్లెళ్ల మధ్య అనురాగం, అనుబంధాల నేపథ్యంలో సాగే గీతమిది. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కిశోర్ కుమార్.

# ఏళ్లు గడిచినా.. అలాంటి పాత్రలో మళ్లీ నటించాలని ఉంది!

ఇటీవలే విడుదలై, విజయవంతంగా థియేటర్లలో ప్రదర్శితమవుతున్న 'జైలర్ 2' చిత్రంలో కాంత పాత్రలో తెరపై మెరిసి కుర్రకారుని అలరించారు నటి విద్యాబాలన్. తదుపరిగా పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్‌లో కీలకమైన విజయంగా నిలిచిన 'ది డర్టీ పిక్చర్'(2011) గురించి మాట్లాడారు. ఆ సినిమా వచ్చి 15 ఏళ్లు గడిచినా అలాంటి పాత్రను మళ్లీ పోషించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. "ఏక్తా కపూర్ 'ది డర్టీ పిక్చర్' సీక్వెల్‌ని ప్రకటించడం గురించి విన్నాను. ఒకవేళ దీంట్లో భాగమయ్యేందుకు ఆమె నన్ను సంప్రదిస్తే చాలా సంతోషిస్తా. కానీ మొదటి చిత్రంతోనే సిల్క్ స్మిత కథ పూర్తి అయిపోయింది. బహుశా ఇది అలాంటి మరో కథను తెరపైకి తీసుకువచ్చే సన్నాహాలై ఉండొచ్చు. ఇది విభిన్నమైన కథకు ఆస్కారం కల్పించే ప్రాజెక్ట్. ఏం జరుగుతుందో చూడాలి. ఆ సినిమాలో నేను నటించిన తర్వాత అలాంటి పాత్రని పోషించాలనే తపన ఇన్నేళ్లైనా ఇంకా అలానే ఉంది. పాత్ర ఏదైనా సరే నేను అత్యాశ కలిగిన నటిని. ఈ విషయాన్ని ఇది వరకే ఎన్నో సార్లు చెప్పాను. ఒక ప్రాజెక్ట్ నాకు స్ఫూర్తినిస్తే రెండో ఆలోచన లేకుండా ఆ పాత్రలో పూర్తిగా జీవించేస్తా"అని చెప్పారు.



# అతీంద్రియ రహస్యాల ఆది రుద్ర



ఆది సాయికుమార్ కథానాయకుడిగా... నవరసన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రానికి 'ఆది రుద్ర' అనే పేరుని ఖరారు చేశారు. జనవరిలో పట్టాలెక్కనున్న ఈ సినిమాని త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై జి.రుద్రప్ప నిర్మిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ సినిమా పేరుని ప్రకటిస్తూ, ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. దైవిక, ఆధ్యాత్మిక అంశాలు, అతీంద్రియ రహస్యాలతో ముడిపడిన ఈ కథ 1960 నుంచి 1990ల మధ్యకాలంలో జరుగుతుందని సినీ వర్గాలు తెలిపాయి. "ఉత్కంఠ రేకెత్తించే సన్నివేశాలు, మనసుల్ని హత్తుకునే భావోద్వేగాలు, కట్టిపడేసే విజువల్స్‌తో ఈ చిత్రం ప్రేక్షకులకు మరపురాని అనుభవాన్నిస్తుంది. ఆది సాయికుమార్ గాఢమైన పాత్రలో కనిపించనున్నారు. పాన్ ఇండియా హంగులతో తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"ని దర్శకనిర్మాతలు తెలిపారు. త్వరలోనే ఇతర నటీనటులు, సాంకేతిక బృందం వివరాల్ని ప్రకటిస్తామన్నారు. ఈ చిత్రానికి సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్.

# పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి, ఘన నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ

■ పండుగ సాయన్న సేవలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.

సంగారెడ్డి జిల్లా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయనకు ఘన నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. ప్రజల కోసం నిలబడిన ధైర్యశాలిగా, అన్యాయాన్ని ఎదిరించి బలహీన వర్గాలకు అండగా నిలిచిన వ్యక్తిగా పండుగ సాయన్న గారు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన జీవితం ధైర్యం, పోరాట పటిమ, ప్రజల పట్ల బాధ్యతకు ప్రతీక అని తెలిపారు. ముఖ్యంగా యువత అన్యాయానికి దూరంగా ఉంటూ, న్యాయం వైపు నిలబడాలని, సమాజంలో శాంతి, సామరస్యం, సమానత్వం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

పోలీసులుగా ప్రజల భద్రతను కాపాడటం, బలహీనులకు అండగా నిలవడం, బాధితులకు చట్ట పరిధిలో న్యాయం




అందించడం తమ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలన్నారు.

పండుగ సాయన్న ముదిరాజ్ గారి జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలుగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మహనీయుల సేవలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు చేరుతాయని తెలిపారు.

పండుగ సాయన్న గారి ఆశయాలను స్మరించుకుంటూ, సమానత్వం, న్యాయం, మానవత్వం వంటి విలువలను



ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పద్మావతి, ఏఆర్ డిఎస్పీ నరేందర్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, ఆర్ ఐ లు సురేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్ కార్యాలయ సిబ్బంది

# గీతం యూనివర్సిటీలో టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.

సంగారెడ్డి జిల్లా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్–II పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో 24.10.2026న నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత రిక్రూట్‌మెంట్ టెస్ట్ (CBRT) నేపథ్యంలో, రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం వద్ద చేపట్టనున్న పోలీసు బందోబస్తు, అభ్యర్థుల రాకపోకల మార్గాలు, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలను సమీక్షించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పటిష్టమైన భద్రతా



ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

పరీక్షా నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఇస్నాపూర్ ఇన్‌స్పెక్టర్, భానూర్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, మహేష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావ్, గీతం యూనివర్సిటీ యాజమాన్యం వర్మ, సతీష్ తదితరులు ఉన్నారు.

# పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా విద్యార్థులు, పోలీసు సిబ్బంది, జిల్లా ప్రజలకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు.

– పోటీల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలి -- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.

సంగారెడ్డి జిల్లావిధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది, ప్రజల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు పోలీసు సేవలు, ప్రజా భద్రతపై అవగాహన కల్పించేందుకు వివిధ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సూచించారు.

1. విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు

6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు, డిగ్రీ మరియు ఆపై చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీల వ్యాసం 500 పదాలకు మించకూడదు.

6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అంశాలు:

– సైబర్ నేరాల నివారణలో పోలీసుల, పౌరుల పాత్ర.



– డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్‌కు ఎలా దూరంగా ఉండాలి?

డిగ్రీ, ఆపై చదువుతున్న విద్యార్థులకు అంశాలు:

– సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర.

– తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర.

ఆసక్తి గల విద్యార్థులు https://forms.gle/YkeKUscWu5LFYWFH 7 ఈ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, తమకు నచ్చిన భాషలో వ్యాసం రాసి, దానిని ఫొటో లేదా పిడిఎఫ్ రూపంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. చివరి తేదీ 28.10.2026.

**2. ప్రజలకు షార్ట్ ఫిల్మ్ పోటీలు**

తెలంగాణ రాష్ట్ర పౌరులు పోలీసు సేవలు, ప్రజా భద్రత, నేరాల నివారణ, కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసు అమరవీరుల త్యాగాలు వంటి అంశాలపై గరిష్ఠంగా 3 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించి సమర్పించాలి. జిల్లా స్థాయిలో ఉత్తమ మూడు షార్ట్ ఫిల్మ్‌లను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుంది. ఎంపికైన వారికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు.

**3. ఫొటోగ్రఫీ పోటీలు**

కమ్యూనిటీ పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజాసేవ, నేరాల నివారణ, పోలీసుల విధులు వంటి అంశాలకు సంబంధించిన ఇటీవలి ఫొటోలను పోటీలకు పంపవచ్చు. జిల్లా స్థాయిలో, అనంతరం రాష్ట్రస్థాయిలో ఫొటోలను ఎంపిక చేసి, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు.

ఆసక్తి గల వారు

https://forms.gle/gVpPmmWFrWZNNRBF

6 ఈ లింక్ ద్వారా షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ లు రూపంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. చివరి తేదీ 30.10.2026.

6

# బిజెపిరాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు కు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ రావు దేశ్ పాండే దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు

హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గౌరవ శ్రీ ఎన్. రామచందర్ రావు గారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి, దసరా పండుగ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

**ప్రజలకు శుభాకాంక్షలు మరియు సందేశం:**

ఈ ప్రత్యేక సందర్భంగా రాజేశ్వర్ రావు దేశ్ పాండే గారు మాట్లాడుతూ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ పండుగ ప్రతి ఒక్కరిలో:



- **నూతన ఉత్సాహాన్ని, సకల శుభాలను చేకూర్చాలని,**
- **సమాజంలో శాంతి, సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు వర్ధిల్లాలని,**
- **ప్రతి ఒక్కరి మనస్సులో సానుకూల ఆలోచనలు పెంపొందాలని వారు ఆకాంక్షించారు.**

**కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:**

రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశంలో పలువురు పార్టీ ముఖ్య నేతలు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అందులో ముఖ్యులు:

1. ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి గారు
2. గోదావరి అంజిరెడ్డి గారు (సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు)
3. రాజశేఖర్ రెడ్డి గారు
4. పోచారం రాములు గారు

వీరంతా కలిసి పార్టీ బలోపేతం మరియు రాబోయే సేవా కార్యక్రమాలపై కూడా ఈ సందర్భంగా చర్చించారు.

# ఎంగేజ్మెంట్ వేడుకల్లో పాల్గొన్న :మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

ఖేడ్ మండల పరిధిలోని అంత్వార్ గ్రామ మాజీ సర్పంచ్ సల్మాన్ కుమార్తె ఎంగేజ్మెంట్ వేడుకల్లో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం. భూపాల్ రెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంగేజ్మెంట్ జరుపుకుంటున్న మాజీ సర్పంచ్ కుమార్తెకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను మాజీ సర్పంచ్ శాలువాతో ఘనంగా



సన్మానించారు. వారితో పాటు సిద్దయ్య స్వామి, మాజీ సర్పంచ్లు రాజు,రాజు నాయక్,

# మాజీ మంత్రి హరీశ్ రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన MLA చింత ప్రభాకర్







హైదరాబాద్‌లో మాజీ మంత్రివర్యులు, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కు దసరా సందర్భంగా మీాూ చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు జమ్మి ఆకులు అందించి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆప్యాయంగా పలకరించుకుని, ఆలింగనం చేసుకుని పండుగ శు భాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు...

దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు...

కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ నాయకులు , ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్ లు కార్యకర్తలు ఉన్నారు.

# సదాశివపేట నుండి తుల్జాపూర్ భవానీ అమ్మవారి దర్శనానికి పాదయాత్ర ప్రారంభం





సదాశివపేట పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక సేవాతత్పరులు ఓదెల మాణిక్ రావు ఆధ్వర్యంలో భక్తుల బృందం మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తుల్జాపూర్ భవానీ అమ్మవారి దర్శనార్థం పాదయాత్రగా బయలుదేరారు. లోకకల్యాణం, సకల జనుల సౌభాగ్యం మరియు ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ ఈ కఠిన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ పాదయాత్రలో ఓదెల మాణిక్ రావుతో పాటు వి. శ్రీశైలం, గోపాల్, నాగుల నరేష్, వీరన్న, ప్రవీణ్, సాయికుమార్, పవన్ తదితర భక్తులు దేవి నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. కఠినమైన నియమాలను పాటిస్తూ, అమ్మవారిపై ఉన్న అచంచలమైన భక్తి విశ్వాసాలతో ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి, దేవి కృపాకటాక్షాలు పొందడమే తమ సంకల్పమని భక్తులు పేర్కొన్నారు.

ఈ ఆధ్యాత్మిక యాత్రను విజయవంతం చేయడానికి తోడ్పాటునందిస్తున్న ప్రతి ఒక్కరికీ, అలాగే మార్గమధ్యంలో మద్దతు తెలుపుతున్న స్థానికులకు భక్తుల బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

# యువకులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది



– ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి

కష్టపడే యువకులను బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ అండగా ఉంటుందని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఖేడ్ నియోజకవర్గం మనుర్ మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు పెద్దొడ్డి ప్రవీణ్ మాజీ ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ... కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, వారికి భరోసా కల్పించడం ఆనందంగా ఉందన్నారు. రాజకీయాల్లో యువకులకు అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి, ఎన్నికల వరకు మాత్రమే ఉపయోగించుకుని ఆ తర్వాత పట్టించుకోవడం లేదని విమర్శించారు. అయితే, బీఆర్ఎస్ పార్టీలో యువతను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే యువకులకు గుర్తింపు, అవకాశాలు కల్పించాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మేత్రి శ్రీను,

# ముదిరాజులను ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత నాది: సీఎం రేవంత్ రెడ్డి

**ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలు ఏర్పాటు చేస్తాం**

**రవీంద్ర భారతి, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:**
ముదిరాజులను ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చే అంశంపై వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చిస్తామని ప్రకటించారు. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో పరిశీలన జరిపిస్తామని వెల్లడించారు. గురువారం రవీంద్ర భారతి లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకలకి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, కొడంగల్ నియోజకవర్గంలో ముదిరాజుల జనాభా అత్యధికంగా ఉందని, వారు విశ్వసనీయమైన ప్రజలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పండుగ సాయన్న చరిత్రను స్మరించుకుంటూ, నిజాం పాలనలో భూస్వాములు పేదల భూములను ఆక్రమించుకుంటున్న సమయంలో వారికి అండగా నిలిచిన ధీరుడు సాయన్న అని కొనియాడారు. దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేసి పోరాడారని, పేదలకు ధాన్యం పంచడమే కాకుండా పేద ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. నిజాం పోలీసులు పండుగ సాయన్నను అరెస్టు చేసినప్పుడు నాటి వనపర్తి మహారాణి పెద్ద మొత్తంలో నిధులు చెల్లించి ఆయనను విడిపించారని సీఎం గుర్తుచేశారు. సాయన్నను అన్యాయంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణించి వందేళ్లు దాటినా నేటికీ నాట్లు, కోతల సమయంలో సాయన్న పాటలు వినిపిస్తున్నాయని చెప్పారు.



**కుల గణనతోనే బహుజనులకు గుర్తింపు**
బ్రిటిష్ పాలనలో కుల గణన జరిగిందని, వందేళ్ల తర్వాత తమ ప్రభుత్వం కుల గణన చేపట్టిందని రేవంత్ రెడ్డి తెలిపారు. కుల గణన కారణంగానే నేడు ప్రతి కులం తన జనాభా, హక్కులు, ప్రాతినిధ్యంపై బలంగా గళం వినిపించగలుగుతోందన్నారు. కుల గణనలో తమ జనాభా తక్కువగా నమోదైందని ఎవరైనా భావిస్తే, పూర్తి వివరాలు అందించాలని కోరారు. వాటిని పరిశీలించి అవసరమైతే లెక్కలను సవరిస్తామని హామీ ఇచ్చారు.
సరైన గణాంకాలు అందుబాటులో లేకపోవడం వల్లే గతంలో ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చలేకపోయారని పేర్కొన్నారు. ఈ అంశంపై ఇతర కులాలకు ఉన్న అపోహలు, అనుమానాలను కూడా నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జటిలమైన ఎస్సీ వర్గీకరణను అమలు చేశామని, బీసీ కుల గణనను కూడా చేపట్టామని గుర్తుచేశారు.

**ముదిరాజులకు రాజకీయంగా ప్రాధాన్యం**
ముదిరాజులకు కాంగ్రెస్ పార్టీ తగిన ప్రాధాన్యం కల్పించిందని ముఖ్యమంత్రి తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే శ్రీహరి ముదిరాజ్‌ను డీసీసీ అధ్యక్షుడిగా నియమించానని, ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి మంత్రిని చేశానని వివరించారు. నీలం మధుకు ఎంపీ టికెట్ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.
ముదిరాజులకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచిస్తున్నట్లు వెల్లడించారు. ముదిరాజులకు ప్రభుత్వంలో తగిన భాగస్వామ్యం కల్పించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వాల మంచి పథకాలను కొనసాగిస్తూ రెట్టింపు సంక్షేమం**
ప్రజా సంక్షేమం విషయంలో గత ప్రభుత్వాల మంచి పథకాలను కొనసాగిస్తూ మరింత విస్తృతంగా అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో కిలో రెండు రూపాయలకు బియ్యం అందించారని, తమ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.
గత ప్రభుత్వాల కంటే రెట్టింపు స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలను అందించేందుకు కృషి చేస్తున్నామని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కేసీఆర్ అమలు చేసిన మంచి పథకాలను కొనసాగిస్తూనే ప్రజలకు మరింత సంక్షేమాన్ని అందిస్తున్నామని వివరించారు.

**ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న విగ్రహం**
చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న వంటి మహనీయుల చరిత్రను గతంలో కనుమరుగయ్యేలా చేశారని సీఎం వ్యాఖ్యానించారు. వారి త్యాగాలు, పోరాటాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తామని ప్రకటించారు. పండుగ సాయన్న, గద్దర్, అందెశ్రీ వంటి వ్యక్తులు తమ జీవితాలను సమాజం కోసమే అంకితం చేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర గీతాన్ని అధికారికంగా ప్రకటించుకున్నామని గుర్తుచేశారు.

**బహుజనుల అభ్యున్నతికి రాహుల్ గాంధీ ప్రధాని కావాలి**
బహుజనుల జీవితాల్లో మార్పు రావాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని రేవంత్ రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికలు ఎంతో కీలకమని, ఆ ఎన్నికల్లో రాహుల్ గాంధీకి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, బహుజనుల అభ్యున్నతి లక్ష్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటెల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నేల తల్లిని సంరక్షించుకుంటేనే భవిష్యత్ తరాలకు ఆహార భద్రత -- మంత్రి తుమ్మల

**ఖేత్ బచావో అభియాన్‌తో భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయానికి శ్రీకారంలిలి**
**రసాయన ఎరువులు, పురుగుమందులను శాస్త్రీయ పద్ధతుల్లోనే వినియోగించాలిలి**
**వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలిలి**
**సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలిలి**
**పంట వ్యర్థాలను కాల్చకుండా మల్చింగ్‌కు వినియోగించాలి.. నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలిలి**

**హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:**
నేల తల్లిని సంరక్షించుకుంటేనే భవిష్యత్ తరాలకు ఆహార భద్రత కల్పించగలమని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోకుండా వ్యవసాయంలో ఆశించిన దిగుబడులు సాధించడం సాధ్యం కాదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నేల సారాన్ని పరిరక్షించడం, పంట భూములను సంరక్షించడం, ప్రకృతి వనరులను సమర్థవంతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమంతో పాటు భవిష్యత్ వ్యవసాయాన్ని దృష్టిలో పెట్టుకొని భూసార పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని స్పష్టం చేశారు. గురువారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఖేత్ బచావో అభియాన్' (సాగు భూమి సంరక్షణ) కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూముల పరిరక్షణ, భూసార పరీక్షలు, నీటి పొదుపు, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక, సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పంట వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై రైతులకు కీలక సూచనలు చేశారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములను అందించాలంటే వ్యవసాయ పద్ధతుల్లో శాస్త్రీయ మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, ఋతుపవనాల తగ్గుదల, భూతాపం పెరుగుదల, వర్షపాతం అసమానతలు, వర్షాలు సకాలంలో కురవకపోవడం వంటి పరిస్థితులు వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల సాగులో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూమి స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులను అవసరానికి మించి వినియోగించకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన మోతాదుల్లోనే ఉపయోగించాలని మంత్రి స్పష్టం చేశారు. అధిక మోతాదుల్లో రసాయనాల వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలు పడే ప్రమాదం ఉందని తెలిపారు. పంటల్లో రసాయనాల అవశేషాలు పెరిగితే ఆహార నాణ్యత, భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను పాటిస్తూ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ విధానాలను అనుసరించాలని సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా తన వ్యవసాయ భూమికి భూసార పరీక్షలు చేయించుకోవాలని మంత్రి కోరారు. నేలలో ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకొని, ఏ పంటకు ఎలాంటి ఎరువులు ఎంత మోతాదులో అవసరమో నిర్ధారించుకున్న తర్వాతే వాటిని వినియోగించాలని సూచించారు. దీనివల్ల అనవసరమైన




ఎరువుల ఖర్చును తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి గ్రామం, ప్రతి రైతు భూమికి సంబంధించిన భూసార పరీక్షల వివరాలను క్రమబద్ధంగా నమోదు చేసి, రికార్డులను నిర్వహించాలని ఆదేశించారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులకు అవసరమైన సలహాలు అందించాలని, నేల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించే విధానాన్ని బలోపేతం చేయాలని సూచించారు. రైతులను సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించడంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు కీలక పాత్ర పోషించాలని మంత్రి పేర్కొన్నారు. సేంద్రీయ పద్ధతులు, జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, పంట మార్పిడి వంటి విధానాల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కేవలం సూచనలు ఇవ్వడమే కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడే ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసి, తక్కువ పెట్టుబడితో స్థిరమైన దిగుబడులు సాధించేలా మార్గనిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు.
భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో నీటి వినియోగంలో రైతులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి అన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ, తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని, నీటి ప్రతి చుక్కను సమర్థవంతంగా వినియోగించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో భూమి రకం, నీటి వసతి, స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి రెండు మూడు తడులతో పండే స్వల్పకాలిక పంటలు, అపరాల పంటలను సాగు చేసుకునేలా రైతులకు సలహాలు ఇవ్వాలని సూచించారు. రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించే దిశగా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ పంటలతో పాటు ప్రాంతానికి అనుకూలమైన ఉద్యాన పంటలను సాగు చేసే అవకాశాలను రైతులకు వివరించాలని సూచించారు. రైతులు పెట్టుబడి వ్యయం తగ్గించడం, నీటిని ఆదా చేయడం, పంటకు మార్కెట్‌లో లభించే ధర, నికర ఆదాయం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం చేయాలని సూచించారు.
వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకునే చర్యలు చేపట్టాలని మంత్రి తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకొని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని, పొలాల్లోకి నీరు ఇంకేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, నేల కోత నివారణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాగుల్లో ఇసుకను అధికంగా తీయడం వల్ల నీటి నిల్వలు, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటూ, సహజ నీటి



వనరులను సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.
పంట కోతల అనంతరం మిగిలే వ్యర్థాలను కాల్చివేయడం వల్ల నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులకు నష్టం కలగడంతో పాటు గాలి కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని మంత్రి తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చకుండా వాటిని మల్చింగ్‌కు వినియోగించాలని, నేలలో తేమ నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట వ్యర్థాలను సక్రమంగా వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు పశుపోషణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు అవసరమైన పశుగ్రాసం పెంపకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. పంట అవశేషాలను పశు గ్రాసంగా ఉపయోగించుకునే అవకాశాలను కూడా రైతులు పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణను విస్తృతంగా వినియోగించడం ద్వారా రైతుల శ్రమ, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించవచ్చని మంత్రి అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద అర్హులైన రైతులతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్‌పీఓలు) కూడా వ్యవసాయ పనిముట్లు అందిస్తామని తెలిపారు. ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు సమూహాల ద్వారా వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి తీసుకురావడం వల్ల సాగు పనులు సకాలంలో పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.
ఖేత్ బచావో అభియాన్‌ను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, వ్యవసాయ భూముల పరిరక్షణకు నిరంతరం కొనసాగాల్సిన ఉద్యమంగా తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారులు మండలాల వారీగా కార్యాచరణ రూపొందించి, గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రీయ సాంకేతిక సలహాలు అందిస్తూ, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులను అవలంబించేలా ప్రోత్సహించాలని తెలిపారు.
నేల ఆరోగ్యం, నీటి సంరక్షణ, పంటల వైవిధ్యీకరణ, సేంద్రీయ వ్యవసాయం, పంట వ్యర్థాల సమర్థ వినియోగం వంటి అంశాలపై రైతుల్లో అవగాహన పెంపొందించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత స్థిరమైన, లాభదాయకమైన రంగంగా తీర్చిదిద్దవచ్చని మంత్రి పేర్కొన్నారు. రైతులు ప్రకృతి వనరులను కాపాడుకుంటూ, శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ తెలివిగా వ్యవసాయం చేయాలని సూచించారు. వ్యవసాయ భూములను సంరక్షించడం, నేల సారాన్ని పెంపొందించడం, నీటి వనరులను కాపాడుకోవడం వంటి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఖేత్ బచావో అభియాన్‌ను విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# పీఎం--దక్ష్ ద్వారా 1.87 లక్షల మందికి నైపుణ్య శిక్షణ

**96,162 మందికి ఉపాధి.. పీఎంకేవీవైలో పథకం విలీనం**

**న్యూఢిల్లీ, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:**
సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి దక్షతా ఔర్ కుశలతా సంపన్న హిత్‌గ్రాహి (పీఎం--దక్ష్) పథకం కింద 2020--21 నుంచి 2023--24 వరకు 1,87,305 మంది శిక్షణ పొందగా, 96,162 మందికి ఉపాధి లభించింది. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ పథకం వివరాలను వెల్లడించింది.
ఎస్సీ, ఓబీసీ, ఆర్థికంగా బలహీన వర్గాలు, డీనోటిఫైడ్ తెగలు, పారిశుద్ధ్య కార్మికులు, వ్యర్థాలను సేకరించేవారికి స్వయం ఉపాధి, వేతన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 2020--21లో ఈ కేంద్ర రంగ పథకాన్ని ప్రారంభించారు. జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థిక, అభివృద్ధి సంస్థ, జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థిక, అభివృద్ధి సంస్థ, జాతీయ పారిశుద్ధ్య కార్మికుల ఆర్థిక, అభివృద్ధి సంస్థల ద్వారా అమలు చేశారు.
70 శాతం మందికి ఉపాధి కల్పించాలనే నిబంధన
శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థుల్లో కనీసం 70 శాతం మందికి వేతన ఉపాధి లేదా స్వయం ఉపాధి కల్పించడం శిక్షణ సంస్థలకు తప్పనిసరి చేశారు. ఈ నిబంధనను పాటించని సంస్థలకు శిక్షణ వ్యయంలో చివరి విడతగా చెల్లించాల్సిన 30 శాతం మొత్తాన్ని నిలిపివేస్తారు. ఉపాధి అవకాశాల కోసం సంబంధిత పరిశ్రమలతో సంస్థలు అనుసంధానం కొనసాగించాల్సి ఉంటుంది. అర్హులైన యువత స్వయం ఉపాధి ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునేందుకు మూడు కార్పొరేషన్లు రుణ సదుపాయం, మార్గదర్శక సహాయం అందిస్తున్నాయి.
పీఎం--దక్ష్‌కు 2020--21 నుంచి 2023--24 వరకు రూ.276.47 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు వాస్తవ వ్యయం రూ.309.5 కోట్లుగా నమోదైనట్లు శాఖ పేర్కొంది.
పథకంపై నిర్వహించిన మూల్యాంకన అధ్యయనంలో 90 శాతానికి పైగా లబ్ధిదారులు శిక్షణ తమ వృత్తి లక్ష్యాలకు, స్థానిక ఉపాధి అవసరాలకు అనుగుణంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, అణగారిన వర్గాల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం, సామాజిక గుర్తింపు పెరిగినట్లు అధ్యయనం వెల్లడించింది. అధికశాతం లబ్ధిదారులు నేర్చుకున్న నైపుణ్యాలను కొనసాగిస్తూ, దీర్ఘకాలిక ఆదాయ వృద్ధిపై ఆశాభావంతో ఉన్నట్లు పేర్కొంది.
పీఎం--దక్ష్‌లో అందించే శిక్షణకు సంబంధించిన ఉద్యోగ పాత్రలు ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పరిధిలోనూ ఉండటంతో పునరావృతాన్ని నివారించేందుకు 2024--25 నుంచి పీఎం--దక్ష్‌ను పీఎంకేవీవైలో విలీనం చేసినట్లు కేంద్రం వివరించింది.

# భోపాల్‌లో రేపు మత్స్య పెట్టుబడిదారులు, ఎగుమతిదారుల సదస్సు

**పెట్టుబడులు, ప్రాసెసింగ్, ఎగుమతి అవకాశాలపై దృష్టి.. వెయ్యి మందికిపైగా చేపల పెంపకందారుల భాగస్వామ్యం**

**న్యూఢిల్లీ, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 22:**
అంతర్గత జలాల్లో మత్స్య రంగానికి పెట్టుబడులు ఆకర్షించడం, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎగుమతి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా భోపాల్‌లో శుక్రవారం మత్స్య పెట్టుబడిదారులు, ఎగుమతిదారుల సదస్సు--2026 నిర్వహించనున్నారు. కేంద్ర మత్స్యశాఖ, మధ్యప్రదేశ్ ప్రభుత్వ మత్స్యశాఖ సంయుక్తంగా ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నాయి. చేపల ఉత్పత్తితోపాటు ప్రాసెసింగ్, శీతల సరఫరా వ్యవస్థలు, రవాణా, మార్కెటింగ్‌ను అనుసంధానిస్తూ సమగ్ర విలువ గొలుసును అభివృద్ధి చేయడంపై సదస్సు దృష్టి సారించనుంది. మత్స్యకారులు, చేపల పెంపకందారులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు, ఆదాయం కల్పించే అంశాలపై చర్చించనున్నారు. మధ్యప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వెయ్యి మందికిపైగా చేపల పెంపకందారులతోపాటు పెట్టుబడిదారులు, ఎగుమతిదారులు, మత్స్య సహకార సంఘాలు, చేపల పెంపకందారుల ఉత్పత్తిదారుల సంస్థలు, పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు పాల్గొననున్నారు. ప్రాసెసింగ్ సంస్థలు, ఆర్థిక సంస్థలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు కూడా హాజరుకానున్నారు. వ్యాపార అభివృద్ధి, రుణ సదుపాయాలు, మార్కెట్ అనుసంధానం, పరస్పర సహకార అవకాశాలపై చర్చలు జరగనున్నాయి.

**పెట్టుబడులు, ఎగుమతుల మార్గదర్శకాల విడుదల**
సదస్సులో 'మధ్యప్రదేశ్ మత్స్య పెట్టుబడులు, ఎగుమతుల మార్గదర్శకాలు--2026'ను విడుదల చేయనున్నారు. మధ్యప్రదేశ్‌ను కేంద్రం ఇప్పటికే జలాశయ మత్స్య క్లస్టర్‌గా గుర్తించింది. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు, మేత, జలాశయాలు, కేజ్ కల్చర్, జలచరాల ఆరోగ్యం, ప్రాసెసింగ్, శీతల సరఫరా మౌలిక వసతులు, మార్కెట్ అభివృద్ధిలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఈ మార్గదర్శకాలు దోహదపడనున్నాయి.
అంతర్గత రాష్ట్రాల మత్స్య ఎగుమతి సామర్థ్యానికి సంబంధించిన ప్రామాణిక నిర్వహణ విధానాలను కూడా విడుదల చేయనున్నారు. సమీకృత కేజ్ కల్చర్ యూనిట్లను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. మధ్యప్రదేశ్‌లో జలాశయాలు, అమృత్ సరోవర్ల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పరిపాలనా అనుమతిని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అందజేయనున్నారు.

**దేశ మత్స్య ఉత్పత్తిలో అంతర్గత జలాలదే ప్రధాన వాటా**
దేశంలో 2024--25లో మొత్తం చేపల ఉత్పత్తి 197.75 లక్షల టన్నులకు చేరగా, అందులో అంతర్గత జలాల నుంచి 151.60 లక్షల టన్నులు నమోదైంది. ఇది మొత్తం ఉత్పత్తిలో దాదాపు మూడొంతులకుపైగా ఉంది. 2025--26లో భారత సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతుల విలువ రూ.73,890 కోట్లుగా నమోదైంది.దాదాపు 4.50 లక్షల హెక్టార్ల జలవిస్తీర్ణం ఉన్న మధ్యప్రదేశ్‌లో మత్స్య రంగ అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయి. రాష్ట్రంతోపాటు ఇతర అంతర్గత రాష్ట్రాల ఉత్పత్తిని పెట్టుబడులు, ప్రాసెసింగ్, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించేందుకు ఈ సదస్సు వేదిక కానుంది.
మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్, కేంద్ర సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్.పి. సింగ్ బఘేల్, రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమం, మత్స్య అభివృద్ధి శాఖ మంత్రి నారాయణ్ సింగ్ పవార్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

# రేహాన్ వాద్రా 'నిరసనల ఫొటోల వివాదం'.. స్పందించిన బికనేర్ హౌస్




కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ కుమారుడు రేహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్ రాజకీయంగా వివాదానికి దారితీసింది. ఢిల్లీలోని బికనేర్ హౌస్‌లో 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరిట ఆయన తీసిన కొన్ని ఫొటోలను ఎగ్జిబిషన్‌కు ఉంచగా.. వాటిలో కొన్నింటిని తొలగించాలని నిర్వాహకులు కోరడంతో కాంగ్రెస్, భాజపా మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో బికనేర్ హౌస్ స్పష్టతనిచ్చింది.
'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరిట రేహాన్ తాను తీసిన ఫొటోలను తొలిసారి ప్రదర్శనకు ఉంచారు. వన్యప్రాణులు సహా ఇతర థీమ్‌లు, ఢిల్లీలో జరిగిన నిరసనలను ఫొటోలు తీసి ఎగ్జిబిషన్‌లో ఉంచారు. ఆ ఫొటోల్లో కొన్ని రాజకీయ ఉద్దేశాన్ని కలిగి ఉన్నాయని, అవి సంస్థ విధానానికి వ్యతిరేకమంటూ బికనేర్ హౌస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. కళలు, సంస్కృతిని ప్రతిబింబించేవాటిని మాత్రమే ప్రదర్శనకు ఉంచాలని, అందుకే వాటిని తొలగించాలని కోరినట్లు చెప్పింది. ప్రదర్శన ప్రారంభం కావడానికి కొన్ని గంటల ముందే తను ప్రదర్శించిన ఫొటోల్లో చాలావరకు తొలగించాలని, రద్దు చేసుకోవాలని నిర్వాహకులు చెప్పినట్లు వాద్రా సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. అందులో రెచ్చగొట్టేవి ఏవీ లేవన్నారు. కళాకారుల భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేయడం సరికాదన్నారు. దీంతో భాజపా (దీఫీ), కాంగ్రెస్ (జశీఅస్త్రతీవంం) మధ్య మాటల యుద్ధం మొదలైంది.

త్రినెట్ న్యూస్ తెలంగాణ
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



## ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండడం వల్లనే పురస్కారాలు దక్కుతాయి - నటి, రచయిత్రి, దర్శకురాలు శ్రీజ సాదినేని

**సినిమా కథలు సిద్ధం - నటి, రచయిత్రి, దర్శకురాలు శ్రీజ సాదినేని**
**ఇక సినిమాలపై దృష్టి పెడతాను - నటి, రచయిత్రి, దర్శకురాలు శ్రీజ సాదినేని**
**అవార్డులు అందుకున్నా అహంకారం లేకపోవడం వల్లనే పురస్కారాలు దక్కుతాయి - శ్రీజ సాదినేని**
**పురస్కారాలు ఇచ్చేది ప్రతిభకి మాత్రమే- నటి, దర్శకురాలు శ్రీజ సాదినేని**



**హైదరాబాద్, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 22:**
చిన్నతనం నుండి సన్మానాలు సత్కారాలు అలవాటుగా మారినా ఎప్పటికప్పుడు తన ప్రతిభను పెంచుకుంటూ మెరుగు పరచుకోవడం వల్లనే పురస్కారాలు దక్కుతున్నాయని రంగ స్థల, సినీ, టీవీ నటి, రచయిత్రి, దర్శకురాలు శ్రీజ సాదినేని అన్నారు. రవీంద్ర భారతిలో జరిగిన దుగ్గిరాల సోమేశ్వరరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో నటి, రచయిత్రి, దర్శకురాలు శ్రీజ సాదినేనికి దుగ్గిరాల సోమేశ్వర రావు ఆత్మీయ పురస్కారం అందజేశారు.

ఈ సందర్భంగా శ్రీజ మీడియాతో మాట్లాడుతూ అవార్డులు, పురస్కారాలు ఇచ్చేది మనం చేసిన పనికి మాత్రమే అని, వ్యక్తిగతంగా అది మన ఘనత అని విర్రవీగితే పతనం ప్రారంభం అవుతుందని, అది తెలుసుకుని మసలుకో గలగడమే నిజమైన పరిపక్వత అన్నారు. నలభై ఆరు నాటకాలకు దర్శకత్వం వహించినా, నూట ఇరవై ఐదు సినిమాలకు సహ రచయిత్రిగా, నాలుగు వందలకు పైగా సినిమాలకి డబ్బింగ్ చెప్పినా, మూడువేలకు పైగా అవార్డులు అందుకున్నా తనలో అహంకారం ప్రవేశించ లేదని అందుకే అందరూ తనను గౌరవించ గలుగుతున్నారని శ్రీజ తెలిపారు. మేడ ఎక్కేసాము కాబట్టి మెట్లు మర్చిపో కూడదని, ఎదిగే కొద్దీ ఒదిగి ఉండడం తనకు ఇష్టమని ఆమె అన్నారు.

సినిమా దర్శకత్వం తన అంతిమ లక్ష్యమని, తన దర్శకత్వం లో యాభై నాటకాలు పూర్తి అయ్యాక సినిమా దర్శకత్వంపై దృష్టి పెడతానని, ఇప్పటికే సినిమా కథలను సిద్ధం చేసుకుని ఉంచానని విజయనిర్మల గారు తనకు ఆదర్శమని శ్రీజ తెలిపారు. తనకు ఈ పురస్కారం అందించిన దుగ్గిరాల కుటుంబానికి, రసరంజని కార్యనిర్వాహక వర్గానికి, పాత్రికేయ మిత్రులకు ధన్యవాదములు తెలిపారు.

## త్రినెట్ న్యూస్ శశి మోహన కాంతి కిరణం...

**"సాగినంత కాలం నా అంత వాడు లేడందురు సాగకపోతే ఊరక చతికిలబడిపోదురు.**
**కండ బలముతోనే ఘనకార్యం సాధించలేడు**
**బుద్ధి బలము తోడైతే విజయాన్ని వరించగలడు."**




ఇది ఒక సూక్తి కాదు ఒక జీవిత సత్యం. ప్రతి మనిషి గుర్తుంచుకోవాలి అని అనునిత్యం. ఇది మానవ స్వభావాన్ని, జీవిత సత్యాలను మరియు విజయావకాశాలను వివరించే లోతైన విషయం.

మనిషి జీవితం నిరంతరం ఒకేలాగా సాగదు. జీవిత గమనంలో ఎన్నో మార్పులు. జీవితం కొందరికి అనుకూలంగా ఉంటుంది మరికొందరికి ప్రతికూలంగా ఉంటుంది. అనుకూలంగా ఉండి అన్ని సాగినప్పుడు, మనిషి సంపద ,అధికారం ,కీర్తి ,విజయం వరుసగా వస్తున్నప్పుడు తానే శక్తిమంతుడనని , సమాజంలో తనను మించి ఎవడూ లేడని అన్నీ తన ఘనత వల్లనే అని, అహంకారం పెంచుకుంటాడు. తానే అందరికన్నా సుప్రీం అని విర్రవీగుతాడు. ఎదుట వారిని తక్కువ చేసి మాట్లాడుతాడు. ఇతరులు ఏదైనా సలహా ఇవ్వబోయినా వాటిని తిరస్కరిస్తాడు. పురాణాలలో చరిత్రలో ఎందరో రాజులు ,చక్రవర్తులు ,వ్యాపారవేత్తలు, నాయకులు ఈ అహంకారం వల్లనే పరాభవంపాలు అవుతారు. ఫలితం భంగపాటు, సర్వం నాశనం.

అదే అనుకున్నది జరగనప్పుడు, పరిస్థితులు అనుకూలించనప్పుడు ఏమి చేస్తాము కర్మఫలం అని చతికిలబడి పోతాడు. కాలం ఎప్పుడు ఒకరికి దాసోహం అనదు. కాలం ,కర్మం కలిసి రాకుంటే రాజే సేవకుడు అవుతాడు సేవకుడే రాజవుతాడు. ఈ సత్యాన్ని ప్రతి ఒక్కడు అర్థం చేసుకోవాలి.

ఒక్కోసారి కాలం కలిసి రానప్పుడు, సంపదలన్నీ పోయినప్పుడు చిన్న కష్టానికే క్రుంగిపోతారు. ఏమీ చేయలేని అశక్తత ఏర్పడుతుంది. ఆత్మవిశ్వాసం పోతుంది. మనిషి నిస్సహాయ స్థితిలోకి వెళ్ళిపోతాడు. ఒక్కోసారి జీవితాన్ని కూడా కోల్పోతాడు.

ఈ రెండు స్థితులు మంచివి కావు. విజయం వచ్చినప్పుడు పొంగిపోకుండా అపజయం ఎదురైనప్పుడు కృంగిపోకుండా ఉండటమే స్థితప్రజ్ఞత. తెలివిగలవాడు ఎప్పుడు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సంపదను సంబంధాలను జాగ్రత్తగా కాపాడుకుంటాడు. ఒకవేళ తన జీవిత గమనంలో ఓడిపోయినా ఆ ఓటమిని ఒక పాఠంగా స్వీకరించి, మళ్లీ పుంజుకుంటాడు.

అందుకే ప్రతి మనిషి "అధికారం శాశ్వతం కాదు సంపద శాశ్వతం కాదు" అనే నిజాన్ని గ్రహించాలి కాలం అనుకూలంగా ఉన్నప్పుడు విజయాన్ని పరోపకార గుణాన్ని కలిగి ఉండాలి. అలా ఉన్నప్పుడు ఒకవేళ కాలం కలిసి రాకుంటే సమాజం అండగా నిలుస్తుంది. ఒకవేళ అహంకారంతో వీర్రవీగటమే కాకుండా బ్రతుకు నవ్వులపాలై, కోలుకోలేని దెబ్బ తింటారు.

ఈ వ్యాసం చాలా విస్తృతమైనది కనుక ,దీనిని ఇంకొక భాగంగా మీకు అందిస్తాను.

(ఇంకా ఉంది)

శుభోదయం ....శశిబాల

### సాహిత్య లోకం లో ధృవ తార ముదిగొండ శివ ప్రసాద్

# ప్రముఖుల నివాళి







**హైదరాబాద్, చిక్కడపల్లి, త్రినెట్ న్యూస్, అక్టోబరు 22:**
ఇటీవల మృతి చెందిన ప్రఖ్యాత చారిత్రక నవలా రచయిత ఆచార్య ముదిగొండ శివ ప్రసాద్ స్మృత్యంజలి సభ శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై గాన సభ నిర్వహణలో సాధన నరసింహా చార్య పర్యవేక్షణ లో జరిగింది పాట్నా హై కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నరసింహా రెడ్డి మాట్లాడుతూ ముదిగొండ భారతీయ ఆత్మ ను తన రచనలో శివ ప్రసాద్ ఆవిష్కరించారు అన్నారు భౌతికమైన ఆరోగ్య సమస్యలు లెక్క చేయక జాతి తెలుసుకోవాల్సిన పలు అంశాలు తన రచనల ద్వారా అందించిన మేధో రచయిత అని చెప్పారు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ సమాజాన్ని మానవత్వం తో అర్థం చేసుకొని రచనలు చేసిన శివ ప్రసాద్ తనకు అత్యంత సన్నిహితుడు అని చెప్పారు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానంద రావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొఫెసర్ గా శివ ప్రసాద్ పని చేసిన కాలం లో తను విద్యార్థిని అని గుర్తు చేసుకున్నారు అసాధారణ జ్ఞాపక శక్తి భాషా పాండిత్యం ఆయనను విశిష్ట స్థానం లో నిలిపింది అన్నారు కొన్ని నవలలకు తను లేఖకుడు గా పని చేసిన సందర్భం తెలిపారు శివ ప్రసాద్ దేశం లో ఎమర్జెన్సీ సమయం లో జైలు శిక్ష అనుభవించారు అని చెప్పారు ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ శివ ప్రసాద్ విశేష గ్రంథ అధ్యయనం చేసి గొప్ప పరిశోధనాత్మక నవలలు రాయకలిగారూ అని చెప్పారు అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ శివ ప్రసాద్ కు గాన సభ పట్ల విశేషమైన అభిమానం అని చెప్పారు ఆయన తన భార్య పేరిట ప్రతి ఏటా అవార్డ్ ప్రదానం చేసేవారు అని వారి కుమారుడు తో సంప్రదించి వారి పేరిట పురస్కారం ఏర్పాటు చేసే సూచన పరిశీలన చేస్తాము అని తెలిపారు వేదిక పై ప్రముఖ హాస్యావదాని శంకర నారాయణ కిన్నెర రఘురాం వంశీ రామరాజు జాగృతి సంపాదకుడు విజయ సారధి ఆచార్య కశిరెడ్డి వెంకట రెడ్డి సత్యవాణి సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు తదితర ప్రముఖులు పాల్గొని శివ ప్రసాద్ తో తమ అనుబంధ విశేషాలు తెలిపారు

## మెండే లింగస్వామి పార్థివదేహానికి నివాళులు అర్పించిన భారతదేశ క్రీడాయ్ ప్రెసిడెంట్ గుమ్మ రామ్ రెడ్డి





**త్రినెట్ న్యూస్, అక్టోబరు22/మీడియా టుడే:**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామం నివాసి మెండే లింగస్వామి యాదవ్ నిన్న రాత్రి పాముకాటుతో మరణించారు.భారతదేశం క్రీడాయ్ ప్రెసిడెంట్ అయిన పెద్ద కంపెనీకి అధిపతి అయిన తన కంపెనీలో పనిచేసిన ఉద్యోగి చిన్న వయసుల్లో (38) చనిపోతే తన షెడ్యూల్స్ అన్ని కాన్సల్ చేసుకొని బాధిత కుటుంబానికి అండగా తనకు భార్య 5సం ల కొడుకు 3సం ల కొడుకు ఉన్నారని తెలుసుకొని అలాగే 14సం లు తన చేతిలోనే ఉద్యోగి పెరగడం తను దూరం అవ్వడం ఆయనకు మనసు చలించి ధైర్యాన్ని నింపడం కోసం గుమ్మ రామ్ రెడ్డి-సరళ దంపతులు వచ్చి ఆ కుటుంబాన్నీ పరామర్శించారు.నిజంగా మీ నిబద్ధతకు ధన్యవాదాలు అంతిమ యాత్రలో గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# కాలానుగుణంగా చట్ట సంస్కరణలు జరగాలి

**కాలం చెల్లిన చట్టాలను రద్దు చేయాలి: ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్**

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 22:**
మారుతున్న కాలానికి అనుగుణంగా చట్ట సంస్కరణలు చేపట్టాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. సమర్థవంతమైన పాలన కోసం కాలం చెల్లిన చట్టాలను రాష్ట్రాలు రద్దు చేయాలని సూచించారు. భారత న్యాయ కమిషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన 'సహకార సమాఖ్య విధానం--చట్ట సంస్కరణలు: జాతీయ, రాష్ట్ర దృక్పథం' సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి న్యాయబద్ధమైన, సురక్షితమైన, గౌరవప్రదమైన జీవితాన్ని కల్పించడమే చట్టాల అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు. చట్ట సంస్కరణలు మారుతున్న కాలానికి అనుగుణంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.
బలమైన రాష్ట్రాలు బలమైన కేంద్రానికి దోహదపడతాయని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. సహకార పాలన ద్వారానే రాజ్యాంగ ఆదర్శాలను ప్రజా ప్రయోజనాలుగా మలచవచ్చని ఉద్ఘాటించారు.




# ఆపరేషన్ సీల్‌తో మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ దిగ్బంధం

**నేర నియంత్రణే లక్ష్యం.. అర్ధరాత్రి విస్తృతంగా వాహన తనిఖీలు**

**హైదరాబాద్, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 22:**
నేర నియంత్రణ, ప్రజా భద్రతే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసులు 'ఆపరేషన్ సీల్' పేరిట విస్తృత తనిఖీలు నిర్వహించారు. గురువారం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు గంటల పాటు కమిషనరేట్ పరిధిలోని 54 ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి, కీలక మార్గాలను దిగ్బంధించారు. ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో మొత్తం 1,098 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నేరస్థుల కదలికలను గుర్తించడం, అనుమానాస్పద వ్యక్తుల సంచారాన్ని నియంత్రించడం, నేరాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించడంతో పాటు వాహనదారుల పత్రాలను పరిశీలించారు.

**చోరీ వాహనాల గుర్తింపునకు చర్యలు**

ఆపరేషన్ సీల్‌లో భాగంగా నిర్వహించిన వాహన తనిఖీల ద్వారా చోరీకి గురైన వాహనాలను గుర్తించడంతో పాటు సరైన పత్రాలు లేని వాహనాలపై కూడా దృష్టి సారించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను పరిశీలిస్తూ నేర కార్యకలాపాలకు పాల్పడే అవకాశమున్న వారిపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు.

**విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం**

ప్రజలకు భద్రతపై భరోసా కల్పించడం, శాంతిభద్రతలను పటిష్టంగా నిర్వహించడం, నేరగాళ్లలో భయాన్ని కలిగించడం వంటి లక్ష్యాలతో ఆపరేషన్ సీల్ నిర్వహించినట్లు అధికారులు వివరించారు. ఇలాంటి ప్రత్యేక తనిఖీలతో కమిషనరేట్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ మరింత పెరుగుతుందని తెలిపారు. నేర నియంత్రణతో పాటు ప్రజా భద్రతను మెరుగుపరిచేందుకు పోలీసులు చేపట్టిన ఈ విస్తృత తనిఖీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాత్రివేళల్లో అనుమానాస్పద కదలికలను అరికట్టడం, అక్రమ కార్యకలాపాలపై నిఘా పెంచడం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణకు మరింత పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136